రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని

ఒంటరిపాటు చేయాలి

- వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలపర్చాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ రాజకీయ తీర్మానం

• లోపలి పేజీలో.. •

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 105 | విజయవాడ, బుధవారం 16 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 16 November 2022 | Rs



చివరిసారిగా తండ్రిని ముద్దాడుతున్న మహేశ్‌బాబు

ప్రపంచ జనాభా 800 కోట్లు

- మనీలాలో 800 కోట్ల చిన్నారి జననం
- భారత్ వాటానే అత్యధికం
- సవాళ్లు తప్పవన్న ఐక్యరాజ్య సమితి

న్యూయార్క్ : ప్రపంచ జనాభా మంగళవారం నాటికి 800 కోట్లకు చేరింది. 800 కోట్లవ శిశువు జన్మించినట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. మరింత మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్య రంగంలో వస్తున్న అధునాతన మార్పుల కారణంగా ప్రజల ఆయుర్దాయం పెరుగుతోంది. దాంతో ప్రపంచ జనాభాలోనే ఎక్కువ శాతం గత శతాబ్ద కాలంలోనే పెరిగింది. "800కోట్ల ఆశలు, 800కోట్ల కలలు, 800 కోట్ల అవకాశాలు. ఈనాడు మన భూ మండలం 800కోట్ల మందికి ఆవాసమైంది." అని ఐక్యరాజ్య సమితి జనాభా నిధి (యుఎన్‌ఎఫ్‌పిఎ) ట్వీట్ చేసింది.



మనీలాలో 800 కోట్ల చిన్నారి

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలోని టోండోలో స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారు జామున 1.29 గంటలకు జన్మించిన చిన్నారి వినిస్ మబంసాగ్‌ని 800 కోట్ల చిన్నారిగా పరిగణిస్తున్నారు. తల్లీ పిల్లల ఫోటోలను ఫిలిప్పీన్స్ జనాభా కమిషన్ ఫేస్‌బుక్ పేజీలో ప్రచురించింది.


భారత్ వాటానే ఎక్కువ

800 కోట్లకు ప్రపంచ జనాభా చేరిన నేపథ్యంలో ఇందుకు భారత్ ప్రధానంగా దోహదపడిందని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. గత 12 ఏళ్లలో భారత్‌లో 17.7కోట్ల మంది పెరగగా, చైనాలో 7.3 కోట్ల మందే పెరిగారు. వచ్చే ఏడాది కల్లా అత్యంత జనాభా కలిగిన దేశంగా చైనాను భారత్ అధిగమించేస్తుందని భావిస్తు న్నారు. 2037కల్లా కొత్తగా చేరే వంద కోట్ల జనాభాలో కూడా ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచే ఎక్కువ శాతం వుండగలదని, మరోవైపు యూరప్ వాటా ప్రతికూలంగా వుండగలదని యుఎన్ జనాభా నిధి పేర్కొంది.

ఎనిమిది దేశాల్లోనే జనాభా వృద్ధి అధికం

ప్రధానంగా తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో జనాభా వృద్ధి ఎక్కువగా కేంద్రీకృతమవుతోందని పేర్కొంది. 2050 వరకు అంచనా వేసిన పెరుగుదలలో మెజారిటీ భాగం ప్రధానంగా ఎనిమిది దేశాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఆ దేశాల్లో భారత్, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్ వంటి వర్ధమాన దేశాలు, నైజీరియా, ఇథియోపియా వంటి సబ్ సహారా ఆఫ్రికా

మిగతా 5లో



26న రాజ్యాంగ పీఠిక చదవండి

- జిఎడి ఉత్తర్వులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ పీఠిక (ప్రియాంబుల్)ను చదివించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్ర రాజధానిలోని సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు సహా కలెక్టరేట్‌లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల కార్యాలయాలు అన్నింటా 26న ఉదయం 11 గంటలకు రాజ్యాంగ పీఠికను చదవాలని ఉత్తర్వులలో పేర్కొంది.

దౌత్యమే మార్గం

- ఉక్రెయిన్ సమస్యపై జి-20 సదస్సులో ప్రధాని మోడీ పిలుపు
- ఇంధన సరఫరాలపై ఆంక్షలు వద్దని హితవు

బాలి : రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ఘర్షణలను పరిష్కరించుకోవడానికి సంప్రదింపుల ప్రక్రియే మార్గమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. జి-20 సదస్సులో ఇంధన భద్రత, ఆహారం అంశంపై మంగళవారం ఆయన ప్రసంగించారు. ఈ ఘర్షణలను ఆపేందుకు ప్రపంచనేతలు కృత నిశ్చయంతో సమిష్టి కృషి చేయాల్సిఉందని చెప్పారు. గత శతాబ్దంలో రెండో ప్రపంచ యుద్ధం పెను విధ్వంసం సష్టించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అటువంటి పరిస్థితి ఇప్పుడు రాకుండా చూసుకోవాలని చెప్పారు. వాతావరణ మార్పులు, కొవిడ్ మహమ్మారి, ఉక్రెయిన్ పరిణామాలు, వీటితో ముడిపడి ఉన్న సమస్యలన్నీ కలిపి ప్రస్తుతం ప్రపంచ సంక్షోభాన్ని సృష్టించాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలో సంబంధాలు తెగిపోయాయని అన్నారు. దాంతో ప్రతి ఒక్క దేశంలోని సామాన్య పౌరుడు బాధపడుతున్నాడని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల సంక్షోభం కూడా పెద్ద ఎత్తున నెలకొందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మోడీ, చిత్రంలో బైడెన్

ఇటువంటి సమయంలో దేశాధినేతలందరూ ఏకమై సమస్యను పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. ఈ తరహా సమస్యలను పరిష్కరించడంలో ఐక్యరాజ్య సమితి వంటి బహుళపక్ష సంస్థలు కూడా విఫలం అయ్యాయని, ఆ సంస్థల్లో అవసరమైన సంస్కరణలు తీసుకురావడంలో ప్రపంచ నేతలు కూడా విఫలమయ్యారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే జి-20 సదస్సు పట్ల ప్రపంచానికి చాలా ఆశలున్నాయని, వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. అనేక దేశాల్లో ఎరువుల కొరత నెలకొందని, అది భవిష్యత్తులో ఆహార సంక్షోభానికి దారి తీయకుండా చూసుకోవాలన్నారు. ఎరువులు, ఆహారధాన్యాల సరఫరా గొలుసును సుస్థిరపర్చేందుకు ఒప్పందాన్ని అవసరం అన్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ సహా పలువురు దేశాధినేతల సమక్షంలో జి-20 శిఖరాగ్ర సదస్సు లాంఛనంగా ప్రారంభమైంది. సదస్సు ప్రారంభం సందర్భంగా బైడెన్‌ను మోడీ ఆలింగనం చేసుకోవడం కనిపించింది.

సూపర్ స్టార్ కృష్ణ కన్నుమూత

- శోకసముద్రంలో తెలుగు ప్రేక్షకులు
- ప్రధానితో సహా ప్రముఖుల నివాళి
- అధికార లాంఛనాలతో నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి- హైదరాబాద్, విజయవాడ బ్యూరోలు

తెలుగు సినిమాకు సాహసాన్ని, తెగువను పరిచయం చేసిన సూపర్‌స్టార్ కృష్ణ ఇక లేరు. టాలీవుడ్‌లో మొట్టమొదటి జేమ్స్‌బాండ్‌గా, మొట్టమొదటి కౌబాయ్‌గా ప్రేక్షకులను ఆలరించిన నటశేఖరుడు కన్నుమూశారు. డేరింగ్,డాషింగ్, డైనమిక్ పదాలకు నిలువెత్తు రూపంగా నిలిచిన వెండితెర అల్లూరి సీతారామరాజు మంగళవారం తెల్లవారుజామున శాశ్వత విశ్రాంతిలోకి జారుకున్నారు. పరిశ్రమకు ఎందరో కొత్తవారిని పరిచయం చేసి, కష్ట నష్టాల్లో తోడుగా నిలిచిన కృష్ణ తుదిశ్వాస విడిచారన్న సంగతి తెలియడంతో తెలుగు సినిమాలోకంతో పాటు ప్రేక్షకులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఆయనకు అంతిమ నివాళులర్పించడానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు బయలుదేరారు. కార్డియాక్ అరెస్ట్‌తో 79 సంవత్సరాల ఘట్టమనేని ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి ఆయన్ను కాపాడటానికి వైద్యులు చేసిన ప్రయత్నాలు, కుటుంబ సభ్యుల, అభిమానుల ప్రార్ధనలు ఫలించలేదు. మంగళవారం తెల్లవారు

మిగతా 5లో



జోక్యం వద్దు

- గవర్నర్ చర్యలను నిరసిస్తూ తిరువనంతపురంలో ఎల్‌డిఎఫ్ ప్రదర్శన
- రాజ్‌భవన్‌లను సాధనంగా వాడుతున్న బిజెపి : ఏచూరి



తిరువనంతపురంలో మంగళవారం నిర్వహించిన 'రాజ్‌భవన్ మార్చ్'లో పాల్గొన్న ప్రజలు



ప్రసంగిస్తున్న ఏచూరి

తిరువనంతపురం : రాష్ట్ర విశ్వవిద్యాలయాల కార్యకలాపాల్లో కేరళ గవర్నర్ పదే పదే జోక్యం చేసుకోవడాన్ని నిరసిస్తూ, వేలాదిమంది ప్రజలు తిరువనంతపురంలో రాజ్‌భవన్‌కు ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా రంగాన్ని పరిరక్షించేందుకు జరిగిన ఈ ప్రదర్శనలో రాజకీయాలతో నిమిత్తం లేకుండా లక్ష మందికి పైగా పాల్గొన్నారని ఎల్‌డిఎఫ్ నాయకత్వం ప్రకటించింది. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్), ఉన్నత విద్యా పరిరక్షణ వేదిక (హెచ్‌ఇపిఎఫ్) ఈ ప్రదర్శనకు పిలుపునిచ్చాయి. ఈ పరిరక్షణ వేదికలో పలువురు విద్యావేత్తలు, మేధావులు, కళాకారులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రముఖులు వున్నారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు, యువజనులు, కార్మికులు, రైతులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునే దిశగా పయనిస్తున్న దేశ ఉన్నత విద్యా రంగాన్ని ధ్వంసం చేసేందుకు బిజెపి కనుసన్నల్లో మెదిలే గవర్నర్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారని వారు విమర్శించారు. ఉదయం 10గంటలకు మ్యూజియం పోలీసు స్టేషన్ నుండి ప్రదర్శన ప్రారంభమైంది. కాగా, రాజ్‌భవన్ గేటుకు సమీపంలో గల బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకోలేక వేలాదిమంది ప్రజలు రోడ్లపైనే వుండిపోయారు. రాజ్‌భవన్‌కు ప్రదర్శనతో పాటు ఎల్‌డిఎఫ్ పిలుపు మేరకు ప్రతి జిల్లా ప్రధాన కేంద్రంలో నిరసన ప్రదర్శనలు పెద్ద ఎత్తున జరిగాయి. రాజ్‌భవన్ వద్ద ప్రదర్శన అనంతరం జరిగిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కన్నన్ రాజేంద్రన్, డిఎంకెనేత తిరుచి శివ, కేరళ కాంగ్రెస్ నేత జోస్ కె.మణి, జనతాదళ్ నేత మాథ్యూ థామస్, ఎన్‌సిపి నేత పి.సి.చాకో ప్రభృతులు ప్రసంగించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల మేరకు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. గవర్నర్ తన ధోరణిని మార్చుకోవాలని ఎల్‌డిఎఫ్ నేతలు కోరారు. ఎన్నికైన ప్రభుత్వ అధికారాల్లో జోక్యం చేసుకోకుండా దూరంగా వుండాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫెడరల్ సిద్ధాంతాలను నీరుగార్చడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్శిటీల ఛాన్సలర్ హోదాలో గవర్నర్, వర్శిటీల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటూ సంక్షోభాన్ని సృష్టిస్తున్నారంటూ రాజ్‌భవన్‌కు ప్రదర్శన నిర్వహించాల్సిందిగా ఎల్‌డిఎఫ్, హెచ్‌ఇపిఎఫ్ పిలుపునిచ్చాయి. అనంతరం

మిగతా 5లో





ముసలయ్య



రత్నబాబు



సత్యనారాయణ

ప్రమాదం జరిగిన ప్లాంట్‌లో కెమికల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

విజన్ డ్రగ్స్ ఫార్మా కర్మాగారంలో పేలుడు

- ముగ్గురు కార్మికుల మృతి

ప్రజాశక్తి - గోపాలపురం, దేవరపల్లి(తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లాలో మంగళవారం ఘోర ప్రమాదం జరిగింది. దేవరపల్లి మండలం గౌరీపట్నం సమీపంలోని రసాయన కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజన్ డ్రగ్స్ ఫార్మా కర్మాగారంలోని మిథనాల్ ప్లాంట్ వద్ద కంజక్షన్ యూనిట్‌లోని పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అక్కడ యూనిట్ వద్ద పనిచేస్తున్న చాగల్లుకు చెందిన దొంగ మహీధర్‌ముసలయ్య (32), దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన వై.రత్నబాబు (33), గౌరీపట్నంకు చెందిన సత్యనారాయణ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పి సుధీర్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మిథనాల్ ప్లాంట్లోని కెమికల్ ట్యాంకు పేలడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు సమాచారం ఇచ్చామని చెప్పారు. దర్యాప్తు చేపట్టామని, త్వరలోనే

మిగతా 5లో

ప్రమాదకరంగా వాణిజ్య లోటు

- ఎగుమతులు 17% పతనం

న్యూఢిల్లీ : భారత వాణిజ్య లోటు ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఎగుమతులు భారీగా పడిపోవడం, దిగుమతులు తగ్గడంతో లోటు ఎగిసి పడుతోంది. 2022 అక్టోబర్‌లో సరుకుల ఎగుమతులు 16.65 శాతం పతనమై 29.75 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. గతేడాది ఇదే మాసంలో 35.7 బిలియన్ డాలర్ల ఎగుమతులు చోటు చేసుకున్నాయి. గడిచిన నెలలో దిగుమతులు 5.7 శాతం పెరిగి 56.69 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఎగుమతులు తగ్గి.. దిగుమతులు పెరగడంతో గడిచిన నెలలో భారత వాణిజ్య లోటు 26.91 బిలియన్ డాలర్లకు ఎగిసింది. భారత కరెన్సీలో ఇది రూ.2.17 లక్షల కోట్లకు సమానం. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న పక్షపాత పారిశ్రామిక విధానం ఎగుమతులను దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో ఎగుమతులు 12.55 శాతం పెరిగి 263.35 బిలియన్ డాలర్లుగా.. దిగుమతులు 33.12 శాతం ఎగిసి 436.81 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. దీంతో గడిచిన ఏడు మాసాల్లో వాణిజ్య లోటు దాదాపు రెట్టింపై 173.46 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.14 లక్షల కోట్లు)గా నమోదయ్యింది.

బిజెపివి నీచపు రాజకీయాలు

- కవితను పార్టీమారమని ఒత్తిడిచేశారు
- ఆ పార్టీని వదలిపెట్టం
- షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు
- తెలంగాణ సిఎం కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి నీచపు రాజకీయాలను చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి, టిఆర్‌ఎస్ అధినేత కేసిఆర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'బిజెపి చాలా నీచంగా వ్యవహరిస్తోంది. ఎంఎల్‌సి కవితను కూడా పార్టీలో చేరాలని భాజపా ఒత్తిడి చేసింది' అని చెప్పారు. మన రాష్ట్రంలో ఎమ్మెల్యేల బేరసారాల వ్యవహారాన్ని బట్టబయలు చేశామని తెలిపారు. తద్వారా ఆ పార్టీ కుట్రలను ప్రపంచం ముందుంచామన్నారు. అహంకారం, ఉన్మాదంతో వ్యవహరిస్తున్న బిజెపిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. గత ఎనిమిదేండ్లలో తమపై అనేక కేసులు బనాయించినప్పటికీ ఏ ఒక్కటీ రుజువు చేయలేకపోయిందని విమర్శించారు. బిజెపి వద్ద రూ.రెండు లక్షల కోట్లు ఉన్నాయంటూ సింహయాజీ చెబుతున్నారు... ఆ పార్టీకి అంత సొమ్ము ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. మున్ముందు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కూడా ఈడీ దాడులకు పూనుకోవచ్చనీ, అయినా భయపడాల్సిన పనిలేదని భరోసానిచ్చారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో త్వరలో కొంతమందిని అరెస్టు చేసే అవకాశముందని తెలిపారు. మునుగోడు తరహా వ్యూహాన్ని అన్ని ప్రాంతాల్లో అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలుండవని, వచ్చే ఏడాది రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని నిర్దేశించారు. పార్టీ మారుతారా అని ఎవరైనా ఫోన్ చేస్తే.. చెప్పుతో కొడతా అని గట్టిగా సమాధానం చెప్పాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు సూచించారు. 'ఎమ్మెల్యేలు బాగా పనిచేయాలి. ఎమ్మెల్యేలను మార్చాలన్న ఉద్దేశం లేదు. సర్వేలన్నీ తెరాసకే అనుకూలంగా ఉన్నాయి. వందశాతం అధికారం మళ్లీ మనదే' అని ఆయన అన్నారు.

సీమ అభివృద్ధి భిక్ష కాదు... హక్కు

- రాయలసీమ పౌరుషాన్ని మోడీ వద్ద తాకట్టుపెట్టిన జగన్
- సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

• లోపలి పేజీలో.. •

రాష్ట్రవ్యాప్తంగా వంద ఎకో టూరిజం ప్రాజెక్టులు

- అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి ఆదేశం

• లోపలి పేజీలో.. •

ఘనంగా గిరిజన గౌరవ దినోత్సవం

విప్లవ వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి : ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

ప్రజాశకి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విప్లవ వీరుల త్యాగాలు తెలుసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. గిరిజన విప్లవ వీరుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారం రోజులపాటు తలపెట్టిన గిరిజన గౌరవ దినోత్సవాలు మంగళవారం సాయంత్రం విశాఖపట్నం బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ సమీపంలో ప్రారంభమయ్యాయి. డప్పుకొట్టి వాటిని రాజన్నదొర ప్రారంభించారు. తొలుత బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వరకూ గిరిజనులు భారీ ప్రదర్శన నిర్వహించారు. దారి పొడవునా గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర నృత్యంతో సందడి చేశారు. సభా వేదికపై పదికిపైగా గిరిజన సంప్రదాయ నృత్యాలను కళాకారులు ప్రదర్శించారు. ఇవి ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాల ఆరంభం సందర్భంగా నిర్వహించిన సభలో రాజన్నదొర మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితంగా నేడు గిరిజనులకు హక్కులు, చట్టాలు సాధ్యమయ్యాయన్నారు. బిర్సా ముండా గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. అటువంటి యోధుల త్యాగాల ఫలితంగానే బిఆర్.అంబేద్కర్ తన రాజ్యాంగంలో గిరిజన హక్కులకు పెద్దపీట వేశారని అన్నారు. బిర్సా ముండా జీవిత చరిత్రను గిరిజనులందరూ తెలుసుకోవాలని సూచించారు. వారం రోజులపాటు జరిగే గిరిజన గౌరవ దినోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ చైర్మన్ శోభా స్వాతిరాణి, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ జాహ్నవి, టిసిఆర్‌టిఎం డైరెక్టర్ రవీంద్రబాబు, అరకు ఎంపి గొడ్డేటి మాధవి, అరకు, పాడేరు, పాలకొండ ఎమ్మెల్యేలు శెట్టి ఫాల్గుణ, కె.భాగ్యలక్ష్మి, కళావతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ , సీతంపేట ఐటిడిఎ పిఒ నవ్య, జిసిసి ఎమ్‌డి జి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.



డప్పుకొట్టి గిరిజన గౌరవ దినోత్సవాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఒంటరిపాటు చేయాలి

- వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలపర్చాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ రాజకీయ తీర్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఒంటరిపాటు చేయాలని, వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలపర్చాలని సిపిఎం రాష్ట్ర కమిటీ తీర్మానించింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం 13,14 తేదీల్లో విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బి.వి.రాఘవులు హాజరయ్యారు. ఈ సమావేశంలో చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించిన రాజకీయ తీర్మానాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం మీడియాకు విడుదల చేశారు.

రాష్ట్రాన్ని, ప్రజలను బిజెపి పదేపదే దగా చేస్తున్నది. ప్రధానమంత్రి విశాఖ పర్యటనలో రాష్ట్రానికి సంబంధించిన ఒక్క సమస్యనూ ప్రస్తావించలేదు. ముఖ్యమంత్రి ఉపన్యాసంలో కొన్ని అంశాలు ప్రస్తావించినా వాటిపైనా స్పందించలేదు. ముఖ్యమంత్రీ పట్టుబట్టలేదు. మోడీ యాత్ర సందర్భంగా రైల్వేజోన్ ప్రారంభిస్తారని బిజెపి, వైసిపి నాయకులు ఆశలు కల్పించారు. తీరా ప్రధాని పర్యటనలో జోన్ ప్రారంభోత్సవం లేకపోవడంతో బిజెపి మోసకారితనం మరోసారి బట్టబయలైంది. ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటాన్ని నీరుగార్చడానికి ఒకవైపు నిర్బంధం, మరోవైపు తప్పుడు ప్రచారం సాగించింది. విశాఖ ఉక్కును సెయిల్‌లో కలుపుతామంటూ మోసకారి ప్రకటనలు చేసింది. విశాఖ వచ్చిన సందర్భంగా రోడ్లు, భవనాలు, వంతెనలకు ప్రారంభోత్సవాలు చేయడం మినహా రాష్ట్రాభివృద్ధికి ఎటువంటి పథకాలూ ప్రకటించలేదు. ప్రత్యేకహోదా, విభజన హామీల ప్రస్తావనే లేదు. విశాఖలో కార్మికులు, ప్రజలపై సాగుతున్న నిర్బంధాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నది. 638 రోజులుగా సాగుతున్న కూర్మన్నపాలెం ధర్నా టెంట్‌లో నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం దుర్మార్గం. ఇంత జరుగుతున్నా ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం మౌనంగా ఉండడం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టడమే. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు అనుసరిస్తున్న వైఖరి రాష్ట్ర ప్రయోజనాలకు, అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తుంది. ఇప్పటికైనా ఆయా పార్టీలు ముందుకొచ్చి రాష్ట్ర ప్రజల తరపున గళం విప్పాలి. బిజెపి నిరంకుశ మతోన్మాద విధానాలను, రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ఎలుగెత్తి చాటాలి. బిజెపి వ్యతిరేక శక్తులను కూడగట్టేందుకు వామపక్షపార్టీలు చొరవ తీసుకోవాలని సిపిఎం అభిప్రాయపడింది.

శాసన మండలి ఎన్నికల్లో అక్రమాలు

రానున్న శాసనమండలి ఎన్నికలఓట్ల నమోదులో అధికార వైసిపి ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతోంది. నకిలీ ఓట్లు చేర్చినట్లు అనేక ఆధారాలు బట్టబయలయ్యాయి. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక ఐఎఎస్ అధికారిని నియమించి ఓట్లను స్క్రూటినీ చేయించాలని ఎన్నికల సంఘాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. డిఇఒల అక్రమ బదిలీలను ఆపాలి. వలంటీర్ల వినియోగాన్ని నిరోధించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై వేధింపులు, బెదిరింపులకు పాల్పడు తున్నది. స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి.

వరద బాధితులకు పరిహారం చెల్లించాలి

వరదలు, భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కేవలం రెండు వేల రూపాయలు, 20 కేజీల బియ్యంతో చేతులు దులిపేసుకుంది. నష్టపోయిన ఇళ్లకు, పంటలకు ఎలాంటి పరిహారమూ ఇంత వరకు చెల్లించలేదు. కడప, కర్నూలు, అనంతపురం, నంద్యాల జిల్లాల్లో పంటలకు భారీ నష్టం జరిగింది. ఇన్సూరెన్సూ అందలేదు. కేంద్రం నుండీ ఎలాంటి సాయమూ అందలేదు. తక్షణం వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయాలి. మరోవైపు దాదాపు 250 మండలాల్లో అనావృష్టి పరిస్థితులున్నాయి. కరువు మండలాలను గుర్తించి ఆదుకోవాలి.

పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలి

పోలవరం మునక బాధితుల పునరా వాసానికి ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. కాఫర్‌డ్యామ్ ముందు కట్టాలా ? స్పిల్‌వే కట్టాలా వంటి చర్చలతో అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం నిర్వాసితుల సమస్యను పక్కదారి పట్టిస్తున్నాయి. పునరావాసానికి నిధులివ్వడానికి కేంద్రం నిరాకరిస్తోంది. పునరావాస సమస్యలపై గిరిజన సంఘాలు, వామపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. రాష్ట్ర ప్రజానీకం నిర్వాసితులకు అండగా నిలబడాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది.

బలవంతపు భూసేకరణ ఆపాలి

అభివృద్ధి పేరుతో రైతుల నుండి బలవంతపు భూసేకరణ జరుగుతోంది. హైవేలు, పైప్‌లైన్లు, విద్యుత్ లైన్లు, రైల్వే లైన్లకోసం బలవంతంగా భూములు సేకరిస్తున్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించి నష్టపరిహారం చెల్లించాలి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సమీక్షలు, ప్రకటనలు తప్ప ఆచరణలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. మధ్యవర్తులు, మిల్లర్లతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా రైతుల నుండి ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించాలి. భూరక్షణ పేరుతో సాగుతున్న సర్వేలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. ఈ సర్వేలో రైతులను భాగస్వాములను చేసి వివాదాలు లేకుండా చూడాలి. సహకార రంగాన్ని దెబ్బకొట్టే విధంగా చట్టాన్ని సవరించడాన్ని, డైరీ రంగంలో అమూల్‌కి పెద్దపీట వేయడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తున్నది.

ప్రభుత్వ విద్యను బలపర్చాలి

ప్రభుత్వ విద్యను రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ పరం చేసింది. ఇది ప్రభుత్వ విద్యారంగంపై ప్రయివేటు పెత్తనానికి దారితీస్తుంది. ఇప్పటికే ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నది. మునుముందు పేదలకు విద్య భారమయ్యే ప్రమాదం ఉంది.

రాజధాని అమరావతిలోనే

రాజధాని పేరుతో ఉత్తరాంధ్ర ప్రజల్లో భావోద్రేకాలను రెచ్చగొట్టేందుకు వైసిపి ప్రభుత్వం పూనుకుంటుంది. విశాఖే ఏకైక రాజధాని అంటూ మంత్రులు, వైసిపి నేతలు కొత్తరాగం అందుకొంటున్నారు. ఈ వివాదానికి స్వస్తి చెప్పి అమరావతిలోనే రాజధాని కొనసాగించాలి. ఈ ప్రాంతంలో గత కొద్ది నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వకపోవడం దుర్మార్గం. రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై దృష్టిపెట్టి కేంద్రీకరించాలి. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి.

అధిక ధరలు, ప్రజలపై భారాలు

కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ధరలు ఆకాశాన్నంటాయి. దానికితోడు రాష్ట్ర ప్రభుత్వం అదనపు భారాలు మోపుతున్నది. ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. ఇసుక రేట్లు అమాంతం పెరిగాయి. చెత్త పన్ను బలవంతంగా వసూలు చేస్తున్నారు. ప్రజా పంపిణీ ద్వారా బియ్యం తప్ప మరే సరుకులూ ఇవ్వడం లేదు. నగదు బదిలీ పేరుతో అది కూడా ఎత్తేసే ప్రయత్నం జరుగుతున్నది.

జగనన్న ఇళ్ల నిర్మాణ బాధ్యత ప్రభుత్వానిదే

ప్రజలకు ఎంతో కొంత ఊరటగా ఉన్న సంక్షేమ పథకాలకు వివిధ రకాల పేర్లతో కోతలు పెడుతున్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణం పేదలకు భారమవుతున్నది. జనవరిలోగా ఇళ్లు కట్టుకోకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని బెదిరిస్తున్నది. మరోవైపు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టిన లక్షలాది ఎకరాల్లో పరిశ్రమలు పెట్టకపోయినా భూములు వెనక్కి తీసుకోవడం లేదు. టిడ్కో ఇళ్లను ఇంత వరకూ లబ్ధిదారులకు అప్పగించలేదు. మరోవైపు బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయి. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపకుండా వేమన వంటి సంస్కర్తల విగ్రహాలు మార్చడం, హెల్త్ యూనివర్శిటీ పేర్లు మార్చడం, ఇప్పటంలో ఇళ్లు కూల గొట్టడం వంటి చర్యలతో బుల్డోజర్ రాజకీయ సంస్కృతిని ప్రవేశపెడుతున్నది.

కార్మికులకు కనీస వేతనాల చట్టం

వివిధ షెడ్యూలు రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాలను సవరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. కేంద్రం ప్రతిపాదించిన లేబర్ కోడ్‌లకు అందరికన్నా ముందే రూల్స్ తయారు చేసి అమలు జరిపేందుకు పూనుకున్నది. విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ వినియోగదార్లపై అదనపు భారాలు మోపుతున్నది. జెన్‌కో ప్రయివేటీకరణకు పూనుకుంటున్నది. బలవంతంగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నది. పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాల ఆశ చూపటం తప్ప అమలు చేయడం లేదు. నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతున్నది.

నిర్బంధం ఆపాలి

ప్రజా ఉద్యమాలపై సాగుతున్న తీవ్ర నిర్బంధాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండిస్తున్నది. ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తున్నది. బైజూస్ యాప్ డౌన్‌లోడ్ చేయలేదని విజయనగరం జిల్లాలో 530 మంది టీచర్లకు షోకాజు నోటీసులు జారీ చేయడం అమానుషం. రాష్ట్రంలో నిరంతరం 144 సెక్షన్ 30ఎ, అమలులో ఉండడం అప్రజాస్వామికం. ఆ పేరుతో ప్రజా నిరసనలపై ఆంక్షలు పెడుతున్నారు. ఈ నిరంకుశ చర్యలను ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఖండించాలి. అనేక ప్రాంతాల్లో దళిత మహిళా సర్పంచులు అవమానాలు ఎదుర్కొంటున్నారు. మహిళలు, దళితులపై రాష్ట్రంలో దాడులు పెరగడం పట్ల సిపిఎం ఆందోళన వ్యక్తం చేస్తున్నది.

బిజెపిని తిరస్కరించాలి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

బిజెపి మతోన్మాదాన్ని, ప్రజలపై భారాలు మోపుతున్న ఆర్థిక విధానాలను, రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో బిజెపి వ్యతిరేక పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఒక్కతాటిమీదకు రావాలి. దాని దురాగాతాలను ఎదుర్కోవాలి. ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజెపికి ఊతమిస్తున్న వైఎస్సార్‌సిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు తమ వైఖరిని పునరాలోచించుకోవాలి. ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు, ఆందోళనలను మరింత ఉధృతంగా సాగించాలని సిపిఎం రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నది.



గవర్నర్‌తో హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా

గవర్నర్‌తో హైకోర్టు సిజె దంపతుల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులతో హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సుచేత మిశ్రా దంపతులు భేటీ అయ్యారు. గవర్నర్ ఆహ్వానం మేరకు మంగళవారం రాత్రి రాజ్‌భవన్ డిన్నర్‌కు హాజరయ్యారు. సిజె దంపతులకు రాజ్‌భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా స్వాగతం పలికారు. వీరిద్దరు సమకాలీన అంశాలపై చర్చించారు. గవర్నర్ పూర్వాశ్రమంలో న్యాయవాది కాగా విభిన్నమైన అంశాలపై వీరి సమావేశం సాగింది. ఈ కార్యక్రమంలో రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

విశాఖ ఉక్కుపై చిన్నచూపు తగదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్రానికి చిన్నచూపు తగదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ ఉక్కు కర్మాగారం అంశంపై నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖలోని కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 642వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్ఎండి, సిఎంఇ, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి విశాఖలో జరిగిన బహిరంగ సభ ద్వారా ప్రజలకు అర్థమైందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కర్మాగారం పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు మరింత ఉధృతమవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఆ దిశగా కార్మికవర్గం కదలాలని కోరారు. ఎంతటి పోరాటాలతోనైనా ప్లాంట్‌ను పరిరక్షించుకోవడానికి ఉక్కు కార్మికులు సంసిద్ధులై ఉన్నారన్న విషయాన్ని కేంద్రం గుర్తెరగాలన్నారు. త్యాగాలతో ఏర్పడ్డ ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటుపరం కానివ్వబోమని స్పష్టం చేశారు. దీక్షల్లో నాయకులు వెంకటరావు, మధు, బాలకృష్ణ, గోపి, రాజు, దుర్గాప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

'పే అండ్ ప్లే' జిఒ ఉపసంహరించుకోవాలి

- శాప్‌కు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రీడా మైదానాలను ప్రయివేటు సంస్థలకు ఇవ్వడంతో పాటు క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేసేందుకు ఉద్దేశించిన 'పే అండ్ ప్లే' విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఈ మేరకు తీసుకొచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు (జిఒ)ను వెనక్కి తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నాడు డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి రామన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, నాయకులు పి కృష్ణ ఆంధ్రప్రదేశ్ క్రీడ ప్రాధికారి సంస్థ(శాప్) ఎండి వి ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జి రామన్న మీడియాతో మాట్లాడుతూ క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాలు, వికాస కేంద్రాలు, స్విమ్మింగ్ పూల్స్, జిమ్ సెంటర్లను 'పే అండ్ ప్లే' పేరిట ప్రైవేట్ కాంట్రాక్టర్లకు లీజుకు ఇవ్వడమంటే క్రీడల్లో ప్రతి అంశానికి ఫీజులను చెల్లించడమేనని అన్నారు. దీనివల్ల పేద క్రీడాకారులు క్రీడలకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో క్రీడాకారులపై సభ్యత్వ ఫీజు, నెలవారి ఫీజు, సామాగ్రి చార్జీల భారం, వసతి భారం పడుతుందని పేద క్రీడాకారులు ఎలా చెల్లిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించి క్రీడల అభివద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. 'పే అండ్ ప్లే' విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

పాఠశాల విద్య రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్ ఛైర్మన్‌గా రామలింగేశ్వరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర పాఠశాల విద్య, రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్ ఛైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎ రామలింగేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం జిఒ ఆర్‌టి నెంబరు 201 ద్వారా ఉత్తర్వులు విడుదల చేసింది.

ముదపాకలో మహిళ ఆత్మహత్య

వైసిపి నేతల వేధింపులే కారణం : బంధువుల ఆరోపణ

ప్రజాశక్తి - పెందుర్తి (విశాఖపట్నం)

స్థల వివాదంతో విశాఖ జిల్లా పెందుర్తి మండలం ముదపాక పంచాయతీ గోవిందపురంలో సోమవారం రాత్రి కడియాల అచ్చియ్యమ్మ (35) పాడుబడిన బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. భూ వివాదంలో వైసిపి నేతల వేధింపులు తట్టుకోలేక ఆమె చనిపోయిందని బంధువులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు... సారిపల్లి గణేష్, సారిపల్లి సోమేశ్వరరావు కుటుంబాల మధ్య 60 గజాల స్థలం విషయంలో కొంత కాలంగా వివాదం జరుగుతోంది. ప్రస్తుతం ఆ కేసు హైకోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ ఎనిమిదిన సోమేశ్వరరావు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానిక వైసిపి నాయకుల వేధింపులు భరించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో బాధ్యులను అరెస్టు చేస్తామని అప్పట్లో పోలీసులు హామీ ఇచ్చారు. ఓ పక్క వివాదం కోర్టులో నడుస్తుండగానే రెవెన్యూ అధికారులు వివాదస్పద స్థలం 'గ్రామ కంఠం' అని, ఎవ్వరికీ చెందదని తెలుపుతూ నోటీసు ఇచ్చారు. దీంతో ఆందోళనకు గురై సోమేశ్వరరావు అక్క అచ్చియ్యమ్మ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని బావి నుంచి బయటికి తీసి పోస్టుమార్టానికి తరలించే ఏర్పాటు చేయగా ఆమె బంధువులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, న్యాయం జరిగే వరకూ మృతదేహాన్ని తరలించడానికి వీల్లేదని పట్టుబట్టారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమనే అచ్చియ్యమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు పోలీసులు తరలించారు. తోపులాట జరిగే క్రమంలో ఎస్ఐ రాంబాబు కాలికి గాయమైంది. ఈ ఘటనపై పెందుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సిఐ అప్పారావు తెలిపారు



మృతురాలు అచ్చియ్యమ్మ (ఫైల్ ఫొటో)

టిడిపి నేతల పరామర్శ

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి నాయకులు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. వైసిపి నేత, నిందితుడైన సారిపల్లి గణేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని పట్టుబట్టారు. అనంతరం కెజిహెచ్ పోస్టుమార్టం గది వద్ద టిడిపి నాయకులు ఆందోళనకు దిగారు..

సమగ్ర దర్యాప్తు జరపండి : సిపిఎం

అచ్చియ్యమ్మ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆమె మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, పెందుర్తి జోన్ కార్యదర్శి బి రమణి డిమాండ్ చేశారు. స్థానిక అధికారులు అచ్చియ్యమ్మకు నోటీసు ఇవ్వడం, వైసిపి నేతల వేధింపుల వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు



వెంకటరమణ (ఫైల్ ఫొటో)

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... ఆకుతోటలపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ(45)కు రెండు ఎకరాల సొంత పొలం ఉంది. ఇందులో వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేసేవారు. పంట సాగు, కుటుంబ పోషణ నిమిత్తం ఇతరుల వద్ద రూ.ఐదు లక్షల వరకు అప్పులు చేశారు. పంటలు చేతికందకపోవడంతో అప్పుల భారం అధికమైంది. దీనికి తోడు రుణదాతల ఒత్తిడి అధికమవ్వడంతో ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10 మునిసిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్ల గడువు పెంపు

ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 10 మునిసిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్ల గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు 2023 మే 5 లేదా ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పాలన పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో సహా రాజాం, భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లి గూడెం, గుడివాడ, బాపట్ల, గూడూరు, శ్రీకాళహస్తి మునిసిపాలిటీలకు సంబంధించి ప్రత్యేక అధికారుల గడువును పొడిగించిన వాటిలో ఉన్నాయి.

కమీషన్ ఏజెంట్లుగా వైసిపి నేతలు : నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి నేతలు కమీషన్ ఏజెంట్లుగా మారి 'జగనన్న ఇళ్ల' పథకం లబ్ధిదారుల నుంచి రూ.కోట మేర దోచుకుంటున్నారని, ఈ పథకం కోసం చేపడుతున్న భూ సేకరణలోనూ భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. పేద ప్రజల పథకాల్లోనూ భారీ అవినీతికి ప్రభుత్వమే పచ్చజెండా ఊపిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని మీడియాకు విడుదల చేశారు. 2020లో 'పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమాన్ని ప్రారంభించిన సిఎం 30.75 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారన్నారు. ఆ తర్వాత 28 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు జీఓలు ఇచ్చారని, ఇప్పుడు ఆ సంఖ్య 21 లక్షలకు మారిందని తెలిపారు. జగన్ ప్రకటించిన మిగిలిన 7 లక్షల ఇళ్లు ఏమయ్యాయని నాదెండ్ల ప్రశ్నించారు.



ఉంగుటూరులో గోనె సంచుల కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

గోనె సంచుల కోసం రైతుల ఆందోళన

- సంచుల లారీ అడ్డగింత

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా మండల కేంద్రమైన ఉంగుటూరులో గోనె సంచుల కోసం రైతులు ఆందోళన చేపట్టారు. ధాన్యం రాశులు కళ్లాల్లో ఉంటున్నా సంచులు మాత్రం సరఫరా చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన మేరకు సంచులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఉంగుటూరులోని వ్యవసాయ కార్యాలయానికి పది వేల లోడుతో లారీ వచ్చింది. అందులోంచి ఐదు వేల సంచులు దించి మిగతావి మరో గ్రామానికి తీసుకెళ్తుండగా రైతులు అడ్డుకున్నారు. లారీని కదలనీయకుండా అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఆయకట్టు పరిధిలో 1,013 మంది రైతులు 2,676 ఎకరాల్లో వరి పంట పండించారని తెలిపారు. ప్రస్తుతం ధాన్యం అందుబాటులో ఉన్నదాన్ని బట్టి 21,600 గోనె సంచులు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 11,600 మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. సంచుల కొరత కారణంగా రాత్రుళ్లు ధాన్యం వద్దే కాపాలా ఉండాల్సి వస్తోందని ఆవేదన చెందారు. అవసరం ఉన్నంత మేరకు సంచులు సరఫరా చేయకుంటే లారీని కదలనీయబోమని భీష్మించారు. సివిల్ సప్లయిస్ డిటి శేఖర్‌బాబు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అక్కడి పరిస్థితిని ఫోన్‌లో తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. లారీలో మిగిలిన ఐదు వేల సంచులను కూడా దించేయడంతో రైతులు శాంతించారు. అనంతరం వ్యవసాయశాఖ, సొసైటీ సిబ్బంది నిబంధనల మేరకు రైతులకు గోనె సంచులను పంపిణీ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా వంద ఎకో టూరిజం ప్రాజెక్టులు

- అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అటవీశాఖ పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించింది. అడవులను కేంద్రంగా చేసుకొని వంద ఎకో టూరిజం ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర అటవీ, గనులు, విద్యుత్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ మేరకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి అటవీ డివిజన్ పరిధిలో ఐదు చొప్పున ఎకో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం నాడు అమరావతిలోని సచివాలయంలోని తన చాంబర్‌లో అటవీశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎకో టూరిజం ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్గిస్తున్నందున ఎక్కువ ఆదరణ వుంటోందన్నారు. విశాఖపట్నం, తిరుపతి జంతు ప్రదర్శన శాలలను పర్యాటకులను ఆకర్షించేలా మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని కొత్త జంతువులను తీసుకురావాలని సూచించారు. తిరుపతిలోని కపిలతీర్థం నుండి జూ పార్క్ దాకా రోప్‌వే ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అటవీశాఖ జారీ చేసే ఎన్ఓసిల పట్ల అధికారులు అప్రమత్తంగా వుండాలని అన్నారు. రాష్ట్రంలో 2,522 ఫారెస్ట్ బ్లాక్‌ల పరిధిలోని 37లక్షల ఎకరాల భూములను పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఏనుగులు గ్రామాలు, పొలాల్లోకి రాకుండా ట్రెంచ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. జగనన్న లేఅవుట్‌లలో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి నీరబ్‌కుమార్ ప్రసాద్, అటవీశాఖ అధికారులు వై మధుసూదన్‌రెడ్డి, ఎకె ఝా, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం అటవీశాఖకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు తమ సమస్యలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు హామి ఇచ్చారు.

175 స్థానాల్లో గెలుపు.. పెద్ద లక్ష్యం కాదు

- విశాఖ ఉత్తర నియోజవర్గ సమీక్షలో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో 175కు 175 నియోజకవర్గాల్లోనూ గెలుపొందడం పెద్ద లక్ష్యమేమీ కాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో మరో 16 నెలల్లో ఎన్నికలు రానున్నాయని, కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రతి ఇంటికీ తీసుకుపోతున్నామని తెలిపారు. మేనిఫెస్టోలోని హామీల్లో 98 శాతం అమలు చేశామన్నారు. కుప్పం లాంటి నియోజకవర్గంలో కూడా క్లీన్ స్వీప్ చేస్తామన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో ఉన్న విశాఖ ఉత్తర నియోజకవర్గంలోనూ 76 శాతం ఇళ్లకు ప్రభుత్వ పథకాలు అందాయని తెలిపారు. ఎన్ని సమస్యలున్నా కేలండర్ ప్రకారం బటన్ నొక్కి పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఉండకూడదు

- వ్యవసాయ కనెక్షన్లపై మంత్రి పెద్దిరెడ్డి
- సచివాలయాల్లో 1912 టోల్‌ఫ్రీ నెంబరు
- పోల్ టు పోల్ తనిఖీలు విస్తృతం
- వేసవి డిమాండును తట్టుకునేలా సరఫరా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉచిత విద్యుత్ కనెక్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయం నుండి విద్యుత్‌శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ అందించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. వ్యవసాయ కనెక్షన్లు కోసం చేసుకున్న దరఖాస్తులు రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారనే విమర్శలు వస్తున్నాయని, ఇక ముందు రాకూడదని తెలిపారు. రైతుల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదునూ సీరియస్‌గా తీసుకుంటామని వివరించారు. రానున్న వేసవి డిమాండుకు తగిన విధంగా సరఫరా ఉండాలని, అందుకోసం ట్రాన్స్‌కోతో డిస్కమ్‌లు సమన్వయం చేసుకోవాలని, ముందస్తు ప్రణాళికతో ఇబ్బందులను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇంధనశాఖ ప్రతిష్టను పెంచేలా అందరూ పనిచేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆక్వాజోన్ పరిధిలో అర్హులైన రైతులకు సబ్సిడీపై ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని, దీనిపై సర్కిళ్ల వారీగా ఎంత విద్యుత్ సబ్సిడీ అందిస్తోంది, జోన్ పరిధిలో డిమాండు ఉంత ఉందనే అంశాలపై వివరాలను తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే మంజూరు చేసిన 33/11 కెవి స్టేషన్ల నిర్మాణం మూడు నెలల్లో పూర్తి చేయాలని, కొన్ని చోట్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, వీటిపై దృష్టి సారించాలని తెలిపారు. ఇండోర్ సబ్‌స్టేషన్ల వల్ల ఎక్కువ వ్యయం అవుతోందని, అర్బన్ ప్రాంతాల్లో తప్పనిసరి అయితే మాత్రమే వీటిని ప్రతిపాదించాలని తెలిపారు. రూరల్ ప్రాంతాల్లో ఇండోర్ స్టేషన్లు నిర్మించడానికి వీల్లేదని పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ అధికారులూ పాల్గొనాలని పేర్కొన్నారు. స్థానికంగా పరిష్కరించే సమస్యలపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని తెలిపారు. ప్రతి సమస్యనూ రికార్డు చేయాలని, వాటిపై తీసుకున్న చర్యలనూ వివరించాలని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్మాణంలో ఎక్కడైనా అటవీ, రెవెన్యూ విభాగాల నుండి అనుమతులు రాకపోతే వాటిని పరిష్కరించుకునేందుకు డిస్కమ్‌ల స్థాయిలో నోడల్ అధికారులను నియమించుకోవాలని, కిందస్థాయిలో పరిష్కారం కాకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అనుమతులు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ట్రాన్స్‌లో సిఎండి బి.శ్రీధర్, విజిలెన్స్ జెఎండి మల్లారెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్లు భాస్కర్, డిస్కమ్ సిఎండిలు పద్మా జనార్ధన్‌రెడ్డి, సంతోష్‌రావు పాల్గొన్నారు.

ఎఐకెఎస్ మహాసభను జయప్రదం చేయాలి

- ఏపి రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేరళలో డిసెంబరు 13 నుంచి 16 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 35వ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఎఐకెఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, గిరిజన నాయకులు బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని ఎఐకెఎస్ పతాక ఆవిష్కరణలు చేపట్టినట్లు తెలిపారు. జమీందారీ వ్యవస్థ వ్యతిరేకంగా దున్నే వానికి భూమి కావాలని, అధిక వడ్డీలు, అధిక పన్నులు వ్యతిరేకంగా ఎఐకెఎస్ ఉద్యమించిందన్నారు. కార్పొరేట్ వ్యవసాయానికి ఉపక్రమించేందుకు మోడీ సర్కార్ దుర్మార్గ విధానం తిప్పికొట్టాలని, ఇదే పోరాట స్ఫూర్తితో కేరళలో జరగనున్న ఎఐకెఎస్ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మాజీ అధ్యక్షులు వై కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం సూర్యనారాయణ, హరిబాబు, గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు నాయకులు కాట్రగడ్డ శివన్నారాయణ, అప్పలస్వామి పాల్గొన్నారు.

సీమ అభివృద్ధి భిక్ష కాదు... హక్కు

- రాయలసీమ పౌరుషాన్ని మోడీ వద్ద తాకట్టుపెట్టిన జగన్
- సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి


సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- గుంతకల్లు (అనంతపురం జిల్లా)

రాయలసీమ సమగ్రాభివృద్ధి భిక్షకాదని, అది సీమ ప్రజల హక్కు అన్న విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. 'రాయలసీమ సమగ్రాభివృద్ధి అవకాశాలు -ఆటంకాలు - పరిష్కారాలు' అనే అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగుతున్న సదస్సు అనంతపురం జిల్లా గుంతకల్లులోని రాయల్ ఫంక్షన్ హాలులో మంగళవారం ప్రారంభమైంది. సిపిఎం గుంతకల్లు పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో రాయలసీమ జిల్లాల సిపిఎం జిల్లా కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు. సదస్సుకు ముఖ్యవక్తగా హాజరైన ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాయల కాలంలో రతనాల సీమగా రాయలసీమ ఉండేదన్నారు. నేటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాళ్ల సీమగా మారిందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసగించిందన్నారు. సీమకు అన్యాయం చేసిన ప్రధాని మోడీ విశాఖ సభకు జనాన్ని తరలించి రాయలసీమ పౌరుషాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాకట్టు పెట్టారని విమర్శించారు. సాగునీటి రంగం నిర్లక్ష్యంతో రాయలసీమ జిల్లాల్లో వ్యవసాయం కుంటుబడుతోందన్నారు. రాయలసీమ జిల్లాల్లో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన వారు రాష్ట్ర ముఖ్యమంత్రులు అయినా సీమ అభివృద్ధికి ఒనగూరిన ప్రయోజనం ఏమీలేదన్నారు. నీటి ప్రాజెక్టులపై పాలకులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. తుంగభద్ర నీరు సక్రమంగా రావడం లేదని తెలిపారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టుల నీరు వస్తేనే సీమ అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. కడప స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకే పరిమితమైందన్నారు. సమైక్య పోరాటాలతోనే రాయలసీమ సమగ్రాభివృద్ధి సాధ్యమని, ఇందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సిపిఎం అనంతపురం, శ్రీ సత్యసాయి, నంద్యాల, కర్నూలు, కడప, తిరుపతి జిల్లాల కార్యదర్శులు వి.రాంభూపాల్, ఎం.ఇంతియాజ్, నాగేశ్వరరావు, రామ్మోహన్‌రెడ్డి, బి.నాగరాజు, పి.ఢిల్లీ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. రెండో రోజు సదస్సులో పలు తీర్మానాలు చేయనున్నారు.

తాత్కాలిక సాగుకు 30 వేల ఎకరాలు

ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్


జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో 50 వేల ఎకరాల వ్యవసాయ భూమి అమరావతి నిర్మాణం నిమిత్తం తీసుకోవడం వల్ల 30వేల మంది వ్యవసాయ కార్మికులు, నిరుపేదలు ఎటువంటి పనులేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అటవీ, దేవాదాయశాఖ, అసైన్డ్, ప్రభుత్వ, ప్రయివేటు భూములతో కలుపుకుని సుమారు 50 వేల ఎకరాలను రాజధాని నిర్మాణం నిమిత్తం తీసుకున్నారని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న భూమిలో ఒక్కొక్కరికి ఎకరం భూమిని తాత్కాలిక పద్ధతిలో సాగు చేసుకునేందుకు ఇవ్వాలని కోరారు. రాజధాని గ్రామాల్లో 24 వేల కుటుంబాలకు ప్రభుత్వం నెలకు రూ.2500 పింఛన్లు ఇస్తున్నా ఈ సొమ్ముతో వారి కుటుంబాల జీవనం గడవడటం లేదన్నారు. గత ఏడేళ్లుగా వ్యవసాయపరమైన కార్యకలాపాలు లేకపోవడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని అన్నారు. ఇళ్ల స్థలాలకు భూములు ఇవ్వకూడదని కొంత మంది నాయకులు చేస్తున్న వాదన కూడా సహేతుకం కాదన్నారు.

పవన్ కల్యాణ్ క్యారెక్టర్ ఆర్టిస్టు : మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి–అనంతపురం ప్రతినిధి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అలావచ్చి ఇలా వెళ్లే 'క్యారెక్టర్ ఆర్టిస్టు' వంటి వారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తీవ్రంగా విమర్శించారు. అనంతపురం జిల్లా ఆలమూరు గ్రామ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, హౌసింగ్ సిఎస్ అజయ్ జైన్, కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఉపాధికి గండి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు


మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రాంతీయ సమావేశం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక నిలయంలో అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడిందన్నారు. లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని, కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయాన్ని విడిచి పట్టణాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కేంద్రం కట్టబెడుతుండడంతో నేడు అదానీ ప్రపంచంలోనే అత్యధిక ధనవంతుల్లో రెండో స్థానానికి ఎగబాకారని గుర్తు చేశారు. మరోవైపు దేశ ప్రజలు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. కులం, మతం పేరుతో పాలకులు ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో బిజెపి వినాశకర విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడాలని కోరారు. సమావేశంలో సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు బేబీ రాణి, రాష్ట్ర కార్యదర్శి స్వరూపరాణి, విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, నాయకులు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

- ఎపిఎస్‌బిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ రాష్ట్ర మహాసభలో ఉమామహేశ్వరరావు


మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి–కడప అర్బన్

ముఠా కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌బిసిఎల్), ఇండియన్ మేడ్ ఫారన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) డిపో హమాలీ యూనియన్ నాల్గోవ రాష్ట్ర మహాసభ కడపలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. ముందుగా మహాసభ జెండాను ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవలి కాలంలో మృతి చెందిన కార్మికులు, ప్రముఖులకు నివాళులర్పించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు పెరుగుతోన్న నేపథ్యంలో హమాలీలకు ఎగుమతి, దిగుమతి కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో ముఠా కార్మికులను ప్రభుత్వాలు విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన ఏ ఒక్కరినీ ఆదుకోలేదని తెలిపారు. పాలకులు కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామన్నారు. అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, కొండలరావు మాట్లాడుతూ.. మద్య నిషేధం అమలు చేస్తే హమాలీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలకు ఒకసారి మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడారు. సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌రావు, నాయకులు నూర్‌మొహమ్మద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు సుంకర రవి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 'గురుకులం'

- విద్యార్థులకు నామమాత్రపు వసతులు
- ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం
- పట్టించుకోని ప్రభుత్వాలు



శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లాలోని దొరవారిసత్రం బిసి సంక్షేమ గురుకుల పాఠశాల భవనం

ప్రజాశక్తి–మడకశిర రూరల్ (శ్రీ సత్యసాయిజిల్లా)

రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మ జ్యోతిరావు పూలే బిసి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. వాటి పరిష్కారంపై ఏ ప్రభుత్వమూ పట్టించుకోవటం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 110 గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. సుమారు 36 వేల మందికిపైగా విద్యార్థులు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచిన పాఠశాలల నుంచి కొన్నింటిని వేరు చేసి బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చారు. ఎక్కువ మంది వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలల్లో దశాబ్దాలుగా అనేక సమస్యలు తిష్ట వేశాయి.

గురుకుల పాఠశాలల్లో బోధన పూర్తిగా అశాస్త్రీయ పద్ధతిల్లో జరుగుతోంది. ఇక్కడ విద్యార్థుల దినచర్య ఉదయం ఐదు గంటలకు ప్రారంభమై రాత్రి పది గంటలకు ముగుస్తుంది. సుమారు 10 గంటలసేపు నాలుగు గోడల మధ్య విద్యార్థులు కూర్చోవాలి. ఈ మూస విధానం వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. విశాలమైన ఆటస్థలం, లైబ్రరీ, టీవీ రూమ్ లాంటివి చాలా పాఠశాలల్లో లేవు. చాలా వరకు ఇరుకు, అద్దె భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. 500 మంది రెగ్యులర్, మిగతా వారంతా అవుట్‌సోర్సింగ్, గెస్ట్ టీచర్స్‌తో విద్యాసంస్థలు నడుస్తున్నాయి. ఈ రెసిడెన్షియల్ స్కూళ్లలో వార్డెన్లు, కేర్‌టేకర్లు మచ్చుకైనా కనిపించరు. ఆ విధులన్నింటినీ ఉపాధ్యాయులే చేయాల్సి రావడంతో అది బోధనపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఉపాధ్యాయులకూ సమస్యలు

గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులనూ సమస్యలు వెంటాడుతున్నాయి. వీరిని ఉపాధ్యాయులు అనడం కంటే మల్టీపర్పస్ వర్కర్స్ అనడం సముచితం. వేలాదిమంది విద్యార్థులు ఉండే ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులే వార్డెన్ విధులనూ నిర్వహించాల్సి వస్తోంది. సంవత్సరానికి ఒక్కరు చొప్పున కిచెన్ వార్డెన్ విధులు నిర్వహించాలి. వైస్ ప్రిన్సిపల్ స్థానంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ పేరిట మరొక టీచర్ పనిచేయాలి. హౌస్‌మాస్టర్ పేరిట 40 మంది విద్యార్థుల బాగోగులు ఒక టీచర్ చూడాలి. ఉదయం ఎనిమిదిగంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పనిచేసే ఉపాధ్యాయులు ప్రపంచంలో బహుశా ఇక్కడ మాత్రమే కనిపిస్తారు. సెలవు రోజుల్లో కూడా కొంతమంది పని చేయాల్సి ఉంటుంది. దీనికితోడు రోజూ రాత్రిపూట పాఠశాలకు కాపలాకాసే పని కూడా వారిదే. మహిళా ఉపాధ్యాయులు సైతం రాత్రి సమయంలో అక్కడ ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రాత్రి విధులు చేయకుంటే ఉన్నతాధికారులు మెమోలు పేరిట ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇబ్బందులపై గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించగా ఉపాధ్యాయులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయినా ఈ తీర్పును అమలు చేయడంలో నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ఉపాధ్యాయులు ఇన్ని బోధనేతర పనులు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధను ఎలా అందిస్తారన్నది ప్రశ్నార్థకంగానే మిగులుతోంది. గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల జీతభత్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. 2018లో నేరుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఇంతవరకు సిపిఎస్ కూడా లేదు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీకి కనీస వేతనం ఇవ్వడం లేదు. ఇక ఏళ్ల తరబడి బదిలీలు లేక కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు.

విద్యాశాఖ పరిధిలోకి తీసుకోవాలి : ఉపాధ్యాయులు

గురుకుల పాఠశాలలను విద్యాశాఖ పరిధిలోకి తీసుకుని ప్రభుత్వంలోకి విలీనం చేయాలని, రెగ్యులర్‌గా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, బోధనేతర పనులను మినహాయించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వార్డెన్లు, కేర్ టేకర్స్‌ని నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తెల్లా హెన్నీ క్రిస్టినా కులాన్ని తేల్చండి

గుంటూరు కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

గుంటూరు జిల్లా పరిషత్ (జెడ్పీ) చైర్‌పర్సన్ తెల్లా హెన్నీ క్రిస్టీనా కులం ఏమిటో మరోసారి ధ్రువీకరించాలని ఆ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో పిటిషనర్ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని మూడు నెలల్లో ఆమె కులాన్ని తేల్చాలని జస్టిస్ డి రమేష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హెన్నీ క్రిస్టినాకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ కొల్లిపర నివాసి ఎం సరళకుమారి హైకోర్టులో 2021లో రిట్ వేశారు.

'సలహాదారులు' ప్రభుత్వం ఇష్టం

చంద్రశేఖర్‌రెడ్డి నియామకంపై స్టేకు హైకోర్టు నిరాకరణ

రాష్ట్ర ఉద్యోగుల సంక్షేమ సలహాదారునిగా ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి నియామకంపై స్టే ఉత్తర్వులు జారీకి హైకోర్టు నిరాకరించింది. సలహాదారులుగా ఎవరిని నియమించాలో ప్రభుత్వ అభీష్టమని చెప్పింది. చంద్రశేఖర్ నియామకాన్ని సవాల్ చేస్తూ కడప జిల్లాకు చెందిన విశ్రాంత ఉద్యోగి ఎస్ మునయ్య దాఖలు చేసిన పిల్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదపరి విచారణను జనవరి 20కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి

- త్వరలో 6500 పోస్టులు భర్తీ : డిజిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామని, త్వరలో ఓ ప్రత్యేక డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటన సందర్భంగా మంగళవారం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఏరీనాలో విశాఖ జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశాఖలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, హత్యాయత్నాలు, అత్యాచారాలు తగ్గాయని అన్నారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర రేంజ్ డిఐజి హరికృష్ణ, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, డిప్యూటీ పోలీస్ కమిషనర్ సుమిత్ సునీల్ గరుడ పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

ప్రజాశక్తి–అద్దంకి (బాపట్ల)

పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న ఘటన బాపట్ల జిల్లా అద్దంకిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..అద్దంకిలోని గరటయ్య కాలనీలో ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన బత్తుల కృష్ణారావు కుమారుడు పెద్దిరాజు(22) అద్దంకిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. స్థానిక పోస్టాఫీస్ పక్క బజారులో నివాసముంటున్న పి.ప్రశాంతి(20) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమెది బలిజ సామాజికతరగతి. పెద్దిరాజు, ప్రశాంతి ఇద్దరూ రెండేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. తామిద్దరం పెళ్లి చేసుకుంటామని పెద్దలను అడ్డగా వారు నిరాకరించారు. కులాలు వేరు కావడంతో వారు ఈ పెళ్లికి అంగీకరించలేదు. కలిసి ఎలాగూ బతకలేమని.. కలిసైనా చనిపోదామని ఇద్దరూ నిర్ణయించుకొని కాకానికుంట వద్ద ఓ చెట్టుకు ఉరేసుకొని ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రేమికులిద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిజర్వులో వైద్యులు

- మంత్రి విడదల రజని

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత లేకుండా కొంతమంది వైద్యులను రిజర్వులో ఉంచుతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ తెలిపారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో మీడియాతో ఆమె మంగళవారం మాట్లాడారు. గత మూడేళ్లలో వైద్యారోగ్యశాఖలో 12 వేల మంది వైద్యులు సహా 45 వేల మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎవరైనా దీర్ఘకాలిక సెలవు పెడితే వెంటనే వైద్యులను నియమించేందుకు కొంతమందిని రిజర్వు (డిఎంహెచ్ఒ, ఆర్‌డిడి పూల్)లో ఉంచనున్నట్లు వెల్లడించారు. ఎక్కడా వైద్యులు లేరన్న మాట రాకుండా చూస్తామని చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వచ్చే సంక్రాంతి నుంచిగానీ, ఉగాది నుంచిగానీ అమలు చేయాలని యోచిస్తున్నామని చెప్పారు.

అమ్మకానికి బిఎస్ఎన్ఎల్ ఆస్తులు

- వేలానికి తాడేపల్లిగూడెం, కొండపల్లి ప్రాపర్టీలు
- జాబితాలో 13 ఆస్తులు



న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి సర్కార్ బిఎస్ఎన్ఎల్ ఆస్తులను విభజించి విక్రయించే పనిలో పడింది. ఆంధ్రప్రదేశ్ సహా మరో నాలుగు రాష్ట్రాల్లోని బిఎస్ఎన్ఎల్ ఆస్తుల వేలానికి మోడీ సర్కార్ ప్రకటన చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లోని బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన 13 ఆస్తులను కేంద్రం వేలానికి పెట్టింది. వీటికి డిసెంబర్ 5 నుంచి బిడ్డింగ్‌లను అహ్వానిస్తున్నట్లు తెలిపింది. దీంతో ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ ఆస్తులను ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టనుంది. ఆస్తుల నగదీకరణలో భాగంగా వీటిని అమ్మేస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్ ఎంఎస్‌టిసితో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం, కొండపల్లిలోని ఆస్తులు, తెలంగాణలోని పటాన్‌చెరు ఆస్తులు, గుజరాత్‌లోని సూరత్, భరుచ్ వద్ద ఉన్న ఆస్తులు, మధ్యప్రదేశ్‌లోని పురాని ఇటార్సీ, దేవాస్ సిటీలోని ఆస్తులు, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, బిజ్‌నార్ వద్ద ఆస్తులను అమ్మకాల జాబితాలో చేర్చింది. ఈ ఆస్తుల విలువ రూ.20,160 కోట్లుగా ఉంటుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) అంచనా వేసింది. ఆర్థిక ఒత్తిడిలో ఉన్న బిఎస్ఎన్ఎల్‌ను ఆదుకుంటామంటూనే కేంద్రం ఈ చర్యలకు పాల్పడటం గమనార్హం. బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ సంస్థలకు రూ.69వేల కోట్ల ఆర్థిక మద్దతును అందిస్తామని 2019లో మోడీ ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఆ సంస్థల ఆస్తుల విక్రయాన్ని చేపట్టడం ఆందోళనకరం.


సంపాదకీయం

'మద్దతు' కరువు

విత్తనం నుంచి విక్రయం వరకూ అన్నింటా తానై అన్నదాతకు భరోసా కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనలు ఆర్భాటంగా వున్నా అమలు అంతంతమాత్రంగానే వుంది. వరి, ఉల్లి, టమోటా, నిమ్మ... ఇలా ఏ పంటకైనా మద్దతు ధర కోసం ఆందోళన చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలో నేటికీ ప్రధాన పంట వరి. దీనిని పండించే వారిలో అత్యధికులు కౌలు రైతులే. నిజమైన ఈ సాగుదార్ల పేర్లు ఇ- క్రాప్ బుకింగ్‌లో ప్రభుత్వం నమోదు చేయడం లేదు. భూయజమానుల పేర్లు అందులో నమోదు చేయడంతో కౌలుదారులు పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోలేక కమిషన్ ఏజెంట్లు, మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తోంది. చిన్న, సన్నకారు రైతులకూ ప్రభుత్వ భరోసా అందడం లేదు. వాలంటీర్లే రైతుల వద్దకు వచ్చి పరిశీలించి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తారని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, అది అంతంతమాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ వారం రోజుల క్రితమే ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ సుమారు ఐదు వేల టన్నులే కొనుగోలు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. రోజుకు వెయ్యి టన్నులు కూడా కొనుగోలు చేయలేదన్న మాట. అక్టోబర్ చివరి వారంలోనే ఉభయ గోదావరి జిల్లాల్లోనూ, కృష్ణాలోని కొన్ని ప్రాంతాల్లోనూ కోతలు ప్రారంభమయ్యాయి. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుని, ఆరబెడుతున్నారు. తరచూ మబ్బులు కనిపిస్తుండటంతో, ఆకాశం వైపు ఆందోళనగా చూస్తూ.. వర్షాలు, తుపానులు వస్తాయేమోనని అన్నదాతలు భయపడుతున్నారు. ఆర్‌బికెలకు సరిపడినన్ని సంచులు కూడా రాకపోవడం గమనార్హం. ఏలూరు జిల్లా ఉంగుటూరులో గోనె సంచుల కోసం రైతులు తాజాగా ఆందోళన చేసి, వచ్చిన లోడులోని సంచులన్నీ దించేసుకోవడం పరిస్థితికి అద్దంపడుతోంది. ఇ-క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. అందుకోసం ప్రయత్నిస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. ఈ యాప్‌తో ధాన్యం కొనుగోళ్ల అనుసంధానంలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. అన్ని ఖర్చులూ భరిస్తామని సర్కారు ప్రకటించినా, కాటా వేయించినందుకు, వేబ్రిడ్జి వద్దకు తీసుకెళ్లినందుకు క్వింటాకు రూ.50 వరకూ ఖర్చవుతోందన్నది క్షేత్రస్థాయి పరిస్థితి. తేమ పేరుతో బస్తాకి రెండు నుంచి మూడు కిలోల తరుగు తీసేస్తున్నారన్న ఫిర్యాదులూ ఉన్నాయి. ఇంటా బయటా అప్పులు చేసి, పసిడి తాకట్టుపెట్టి పెట్టుబడులు పెట్టిన అన్నదాతల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సర్కారు డబ్బులు ఎప్పుడు ఇస్తుందన్న స్పష్టత లేక తలలు పట్టుకుంటున్నారు.

అష్టకష్టాలు పడి పండించిన టమాటాలను మార్కెట్‌కు తీసుకుపోయి అమ్మితే దారిఖర్చులూ రావడం లేదంటూ రైతు కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో కిలో రూ.2 కూడా రాకపోవడంతో కొందరు రైతులు రోడ్లపై పోసేసిన, మరికొందరు పొలాల్లోనే ఉంచేసిన వార్తలు ప్రస్తుత పరిస్థితిని కళ్లకు కడుతున్నాయి. ఉల్లి ధరలు సైతం అమాంతం పడిపోయాయి. మధ్యస్థ, కనిష్ట రకాలకు క్వింటా ధర రూ.వెయ్యిలోపే ఉండటంతో పెట్టిన పెట్టుబడులుసైతం రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులంతా సిండికేట్ అయి ధరలు దిగ్గోస్తున్నారని టమోటా, ఉల్లి రైతులు ఆవేదన వెళ్లగక్కుతున్నారు. గూడూరు నిమ్మ మార్కెట్‌లో కిలో రూ.10 ధర మాత్రమే వస్తుండటంతో, కాయలు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నామని పలువురు రైతులు తెలిపారు. నిమ్మ, టమోట లాంటి వాటి కోసం కోల్డ్ స్టోరేజిలు, ఆహార శుద్ధి పరిశ్రమల లాంటి వాటిని ఏర్పాటు చేయాలన్న రైతన్నల గోడును పట్టించుకునే తీరిక పాలకులకు ఉండటం లేదు. రైతు ప్రభుత్వమని ఊరూవాడా చాటుకుంటున్న పాలకులు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి నికరంగా అన్నదాతల తరపున నిలబడాలి. అన్ని పంటలకు మద్దతు ధర దక్కేలా, ముఖ్యంగా సకాలంలో సక్రమంగా కొనుగోళ్లు జరిపించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

మహనీయుల మాట



మన లక్ష్యం కేవలం ప్రైవేట్ ఆస్తిలో మార్పులు తీసుకు రావడం కాదు. దానిని రద్దు చేయడం. వర్గ వైరుధ్యాలను కప్పిపుచ్చడం కాదు, వర్గాలను రద్దు చేయడం. ప్రస్తుత సమాజానికి మెరుగులు దిద్దడం కాదు. కొత్త సమాజాన్ని నిర్మించడం.

- కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్

అప్పులు ఆదాయ వనరులా!

విశ్లేషణ

దేశంలోని 27 రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమైన 201 మున్సిపల్ కార్పొరేషన్ల ఆదాయ వ్యయాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయనం చేసి ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. దేశంలో ఉన్న పట్టణ, స్థానిక సంస్థలు ఆర్థిక వనరులను పెంచుకోవటానికి కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. వివిధ రకాల అప్పులు సమకూర్చుకోవటం ద్వారా పట్టణ, స్థానిక సంస్థలు ఆదాయ వనరుల కొరతను అధిగమించవచ్చున్నది అందులో ముఖ్యమైనది.

మొదటగా దేశంలో పట్టణ స్థానిక సంస్థల ప్రస్తుత పరిస్థితిని ఆర్‌బిఐ సమీక్షించి నివేదికలో పేర్కొంది. దేశంలో పట్టణీకరణ వేగంగా పెరుతున్నదని, ప్రపంచంలో 2035 నాటికి అత్యంత వేగంగా పెరుగుతున్న అతి పెద్ద నగరాల్లో భారతదేశంలోని 17 నగరాలు ఉంటాయని తెలిపింది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను పట్టణ స్థానిక సంస్థలు ప్రజలకు కల్పించలేకపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.



డా॥ బి.గంగారావు

1992లో చేసిన 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం పట్టణ, స్థానిక సంస్థలకు దఖలు పడిన 18 రకాల అధికారాలు, విధులు, నిధులకు నేటికీ స్వయంప్రతిపత్తి కల్పించలేదు. అనేక అధికారాలు ఇప్పటికీ బదిలీ కాలేదని నివేదికలో చెప్పింది. రాష్ట్రాల స్థాయిలో రాష్ట్ర ఆర్థిక సంఘాలు క్రమం తప్పకుండా ఐదేళ్లకు ఒకసారి నియమించకపోవడం, కమిటీ ఇచ్చిన సిఫార్సులను సంవత్సరాల తరబడి ఆమోదించడం లేదని, ఆమోదించిన సిఫార్సులలో కూడా అనేక కోతలు పెడుతున్నారని తెలిపింది. ఇటీవల కాలంలో రాష్ట్రాల బడ్జెట్‌ల నుండి పట్టణ, స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు బాగా తగ్గిపోయిందని కూడా నొక్కిచెప్పింది.

దేశంలో మున్సిపల్ సంస్థ ఆదాయాలు స్తంభించిపోయాయని, దేశంలోని మొత్తం పట్టణ సంస్థల ఆదాయం దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఒక శాతం లోపుగానే ఉందని నివేదిక విమర్శించింది. ఇతర దేశాల మున్సిపల్ సంస్థల బడ్జెట్లతో చూసినప్పుడు సైతం మన దేశంలోని మున్సిపాలిటీల బడ్జెట్ల పరిమాణం నామమాత్రంగా కూడా లేదు. ప్రపంచంలోని అతి చిన్న దేశాలైన బ్రెజిల్‌లో 7.4 శాతం, దక్షిణాఫ్రికాలో 6 శాతం (జిడిపిలో స్థానిక మున్సిపల్ సంస్థల ఆదాయాలు) ఉన్నాయని తెలిపింది.

వివిధ రకాల మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులు సమకూర్చుకోవాలని తెలిపింది. ఇప్పటికే ఈ సదుపాయం ఉన్నప్పటికీ దేశంలో అత్యధిక మున్సిపల్ సంస్థలు బాండ్ల ద్వారా అప్పులు సేకరించటంలేదని పేర్కొంది. ఇప్పుడు బాంబే స్టాక్ మార్కెట్ లేదా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మున్సిపల్ సంస్థలు నమోదై నిధులు సమకూర్చుకోవాలి. అలాగే క్రెడిట్ రేటింగ్ వ్యవస్థను అన్ని మున్సిపల్ సంస్థలలో అమలు చేయటం ద్వారా మున్సిపల్ సంస్థల ఆర్థిక క్రమశిక్షణ పని తీరును మెరుగు పరచవచ్చని... తద్వారా ప్రతి నగరం లేదా పట్టణం మెరుగైన క్రెడిట్ రేటింగ్ ర్యాంకులు పొంది ఎక్కువ అప్పులు సమీకరించుకోవచ్చని తెలిపింది.

రెండోవైపు దేశంలో మున్సిపల్ సంస్థల పన్ను, పన్నేతర సొంత ఆదాయాలు కూడా పెద్దగా పెరగటం లేదని చెప్పింది. ఫలితంగా దేశంలో అన్ని మున్సిపల్ సంస్థలు రోజురోజుకి కేంద్ర, రాష్ట్ర గ్రాంట్ల మీదే ఆధారపడుతున్నాయని, వీటి నుండి వచ్చే నిధులు కూడా స్వల్పంగా ఉన్నాయని తెలిపింది.

2017-20 మధ్యకాలంలో 201 మున్సిపల్ కార్పొరేషన్ల ఆదాయ వ్యయాలను ఆర్‌బిఐ పరిశీలన చేసింది. ఈ సంస్థల్లో పన్ను, పన్నేతర ఆదాయాలు ఆయా పట్టణాలు పెరుగుతున్న స్థాయిలో పెరగటంలేదు. ఫలితంగా నిధుల కొరతతో ఆ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేక పోతున్నాయని నిర్ధారించింది. కనుక దేశంలో ఉన్న పట్టణ మున్సిపల్ సంస్థలు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌ల మీద ఆధారపడకుండా తమ ఆదాయాలు పెంచుకొని మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని సూచించింది.

ఇందులో మొదటిది వివిధ రకాల మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులు సమకూర్చుకోవాలని తెలిపింది. ఇప్పటికే ఈ సదుపాయం ఉన్నప్పటికీ దేశంలో అత్యధిక మున్సిపల్ సంస్థలు బాండ్ల ద్వారా అప్పులు సేకరించటంలేదని పేర్కొంది. ఇప్పుడు బాంబే స్టాక్ మార్కెట్ లేదా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మున్సిపల్ సంస్థలు నమోదై నిధులు సమకూర్చుకోవాలి. అలాగే క్రెడిట్ రేటింగ్ వ్యవస్థను అన్ని మున్సిపల్ సంస్థలలో అమలు చేయటం ద్వారా మున్సిపల్ సంస్థల ఆర్థిక క్రమశిక్షణ పని తీరును మెరుగు పరచవచ్చని తద్వారా ప్రతి నగరం లేదా పట్టణం మెరుగైన క్రెడిట్ రేటింగ్ ర్యాంకులు పొంది ఎక్కువ అప్పులు సమీకరించుకోవచ్చని తెలిపింది.



పన్ను, పన్నేతర సొంత ఆదాయాలు బాగా పెంచుకోవాలని రెండో అంశంగా సూచించింది. ఆస్తిపన్ను మదింపుపై, పన్నేతర ఆదాయాలపై గతంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను అన్ని మున్సిపల్ సంస్థల్లో అమలు చేయాలని పేర్కొన్నది.

మొత్తంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక సారాంశం ఏమిటంటే పట్టణ మున్సిపల్ సంస్థలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు, నిధులపై ఆధారపడ కూడదని తేల్చి చెప్పింది. తమ పరిధిలో ఉన్న పన్ను, పన్నేతర సొంత ఆదాయాలను పెంచుకోవాలని, బాండ్ల రూపంలో అప్పులు సమీకరించుకోవటంతో పాటు, మౌలిక సదుపాయాలను ప్రైవేటీకరించుకోవడం ద్వారా ఆర్థిక భారాలను తగ్గించుకోవచ్చునని ప్రస్తుత మున్సిపల్ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంగా చెప్పింది.

ఈ నివేదికలో పేర్కొన్న అంశాలు, సిఫార్సులు చాలా ప్రమాదకరమైనవి. పట్టణ మున్సిపల్ సంస్థలు కేంద్ర రాష్ట్ర గ్రాంట్ల మీద ఆధారపడకూడదనేది ప్రపంచ బ్యాంకు సిద్ధాంతం. గత రెండు దశాబ్దాలకు పైగా పట్టణ సంస్కరణలను దేశంలో అమలు చేస్తున్నారు. ఇప్పుడు వీటిని వేగవంతం చేయటానికి కేంద్ర బిజెపి సర్కార్ రకరకాల కమిటీలు, నివేదికల పేర పూనుకుంది.

గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి అమరావతి బాండ్ల పేర రూ.2 వేల కోట్ల అప్పు సమీకరించింది. గతంలో విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ నగర పాలక సంస్థలు కూడా ఈ తరహా బాండ్లు విడుదల చేసి అప్పులు పొందాయి. బాండ్ల ద్వారా మున్సిపల్ సంస్థలు నిధులు సేకరించడం అనే ప్రక్రియ రెండు దశాబ్దాల కిందటే ప్రారంభమైంది. గతంలో పెద్దపెద్ద మున్సిపల్ కార్పొరేషన్లు పెద్దపెద్ద ప్రాజెక్టులు చేపట్టినప్పుడు తమ భూములను ప్రభుత్వ బ్యాంకులలో తనఖా పెట్టి అప్పులు తీసుకునేవి. ఇప్పుడు మున్సిపల్ సంస్థలు స్టాక్ మార్కెట్లలో నమోదై ప్రయివేటు ఏజెన్సీల నుండి నిధులు సమకూర్చుకోవాలనేది ప్రపంచబ్యాంకు ఆదేశం. అలాగే వివిధ రకాల బాండ్లు విడుదల చేసి ప్రైవేటు సంస్థల నుండి అప్పులు సమకూర్చుకోవాలి. ఈ పద్ధతిలో నిధులు సమకూర్చుకునే మున్సిపల్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కొన్ని రాయితీలు కూడా ప్రకటించింది. ఉదాహరణకు స్టాక్ మార్కెట్ల ద్వారా రూ.100 కోట్లు అప్పు సేకరించుకుంటే ఆ మున్సిపల్ సంస్థకు రూ.13 కోట్లు ఇన్‌సెంటివ్‌గా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక సారాంశం ఏమిటంటే పట్టణ మున్సిపల్ సంస్థలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు, నిధులపై ఆధారపడ కూడదని తేల్చి చెప్పింది. తమ పరిధిలో ఉన్న పన్ను, పన్నేతర సొంత ఆదాయాలను పెంచుకోవాలని, బాండ్ల రూపంలో అప్పులు సమీకరించుకోవటంతో పాటు, మౌలిక సదుపాయాలను ప్రైవేటీకరించుకోవడం ద్వారా ఆర్థిక భారాలను తగ్గించుకోవచ్చునని ప్రస్తుత మున్సిపల్ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంగా చెప్పింది.

అయితే స్టాక్ మార్కెట్ల ద్వారా, ప్రయివేటు ఏజెన్సీల ద్వారా అప్పులు పొందాలంటే ముందుగా క్రెడిట్ రేటింగ్ సంస్థల ద్వారా మున్సిపల్ సంస్థల ఆర్థిక తీరుపై మదింపు జరగాలి. అప్పులు పొందే అర్హతలు ఈ సంస్థలకు ఉన్నాయా? లేదా? అనేది నిర్ధారణ జరగాలి. ఆ తర్వాత క్రెడిట్ రేటింగ్ 'ఎఎ' నుండి 'డి' వరకు ఇస్తారు. ఇటీవల 364 స్మార్ట్ సిటీలు, అమృత నగరాలు క్రెడిట్ రేటింగ్ పొందాయి. అయితే వీటిలో 144 సంస్థలు మాత్రమే అప్పుకు అర్హత పొందాయి. రేటింగ్ ఇచ్చే సంస్థలు బడా కార్పొరేట్ సంస్థలు. మన దేశంలో క్రిసిల్, కేర్, పిచ్, స్మేరా, ఎసిఆర్‌ఎ తదితర సంస్థలు ముఖ్యమైనవి. అమరావతికి కూడా క్రిసిల్ సంస్థ 'ఎ' ర్యాంక్ ఇచ్చింది. ప్రైవేటీకరణ విధానాలు అన్ని రంగాల్లో అమలు చేసే వాటికి, ప్రజల నుండి పౌరసేవలకు పెద్ద మొత్తంలో యూజర్ ఛార్జీలు వసూలు చేసే మున్సిపల్ సంస్థలకు మొదటి శ్రేణి ర్యాంకులు ఇస్తారు. ప్రైవేటీకరణ విధానాలు అమలు చేయని మున్సిపల్ సంస్థలకు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు అప్పులకు అర్హత కలిగిన ర్యాంకులు ఇవ్వవు. ఇదంతా ఒక పెద్ద తంతు. బాండ్ల ద్వారా అప్పుల సేకరణ, క్రెడిట్ రేటింగ్‌ల ప్రధాన ఉద్దేశం...పౌరసేవలను ప్రైవేటీకరించటం, మౌలిక సదుపాయాల కల్పనలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర తగ్గించుకోవడం లేదా వైదొలగి ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం.

మరోవైపు ప్రపంచ బ్యాంకు, ఏడిబి, డిఎఫ్‌ఐఎ, యు.ఎస్.ఎయిడ్ వంటి సంస్థలన్ని నేడు మన దేశ పట్టణ, స్థానిక సంస్థలలో ప్రత్యక్ష జోక్యం చేసుకుంటున్నాయి. నిధుల సహకారం పేర పౌరసేవలను ప్రైవేటీకరించాలని షరతులు విధిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా పట్టణ స్థానిక సంస్థలను అప్పుల్లోకి దించటానికి ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేయాలని చాలా కాలం నుండి ఒత్తిడి చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాలకు సమీకృత పెట్టుబడి, సిటీ ఛాలెంజ్ ఫండ్ వంటి సంస్థలను ఏర్పాటు చేసింది. మన రాష్ట్రంలో కూడా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎ.పి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థను ఏర్పాటు చేసింది. తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు పట్టణ స్థానిక సంస్థల అప్పుల కోసం అనేక సంస్థలను ఏర్పటు చేశాయి. కేంద్ర ఆర్థిక సంఘం నిధుల ద్వారా పట్టణ స్థానిక సంస్థలలో అనేక రకాల సంస్కరణలు అమలు జరుగుతున్నాయి. అంతేకాక కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యువల్ మిషన్, స్మార్ట్ సిటీ, అమృత పథకాల ద్వారా కూడా ప్రైవేటీకరణ విధానాలను పట్టణాలలో అమలు చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పేర పారిశుధ్య నిర్వహణలో ప్రైవేటీకరణ కోసం నగరాలకు ర్యాంకులను ప్రకటించే పద్ధతి తీసుకొచ్చారు. పట్టణ ప్రణాళికా వ్యవస్థను బడా వ్యాపార వాణిజ్య సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చేస్తున్నారు.

కోవిడ్‌ను ఆసరా చేసుకొని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే అప్పులకు...పట్టణ సంస్కరణలకు ముడిపెట్టింది. ఆంధ్ర రాష్ట్రం ఈ షరతుకు తలొగ్గి ఆస్తి పన్నును ఆస్తి విలువకు ముడిపెట్టి భారీగా ఆస్తిపన్ను పెంచింది. పారిశుధ్య రంగంలో యూజర్ ఛార్జీలు ప్రవేశపెట్టింది. రోడ్ల వెడల్పుల పేర ఇంప్యాక్ట్ ఫీజును అమలులోకి తెచ్చింది. ఇలా అనేక రాష్ట్రాలు కేంద్రానికి లొంగి ఈ సంస్కరణలను అమలు చేస్తున్నాయి.

వాస్తవంగా పట్టణ రంగం రాష్ట్ర జాబితా లోనిది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర జాబితా లోని అనేక రంగాలను తన పరిధిలోకి బలవంతంగా గుంజుకుంటున్నది. దేశవ్యాప్తంగా పట్టణ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను అమలు చేయటానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. ఏకపక్షంగా మున్సిపల్ సంస్థలకు సంబంధించిన అనేక చట్టాలను మార్చేసింది. మున్సిపల్ పరిధిలో ఉన్న కొన్ని పన్నులను కూడా జిఎస్‌టిలో కలిపి మున్సిపల్ సంస్థల ఆదాయానికి గండి కొట్టింది. దేశ పట్టణ వ్యవస్థపై కార్పొరేట్ శక్తుల దోపిడి పెంచటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అందులో భాగమే ఈ నివేదికలు.

(వ్యాసకర్త సెల్ : 9490098792)

అమెరికా మధ్యంతర ఎన్నికలు - కొన్ని సంకేతాలు

అంతర్జాతీయం


నవంబరు ఎనిమిదిన అమెరికా పార్లమెంటు, రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. పదిహేనవ తేదీ మంగళవారం నాటికి కూడా లెక్కింపు పూర్తి కాలేదు. అక్కడ అనుసరిస్తున్న ఓటింగ్, లెక్కింపు విధానాలతో ఫలితాల ఖరారు ఎక్కువ రోజులు తీసుకుంటున్నది. పార్లమెంటు దిగువ సభలో 435 స్థానాలకుగాను 218 తెచ్చుకున్నవారికి స్పీకర్ పదవి దక్కుతుంది. తాజా వివరాల ప్రకారం రిపబ్లికన్లు 217, డెమోక్రాట్లు 206 స్థానాలతో ఉన్నారు. రిపబ్లికన్లకు మెజారిటీ రానుంది. వంద సీట్లున్న ఎగువ సభ సెనేట్‌లో ఇద్దరు ఇతర పార్టీల వారి మద్దతుతో డెమోక్రటిక్ పార్టీ బలం 50 కాగా రెండవసారి ఎన్నిక జరగాల్సిన అలాస్కా సీటు రిపబ్లికన్ పార్టీకి కచ్చితంగా దక్కుతుంది కనుక దానికి 50 సీట్లు వచ్చినట్లుగా పరిగణిస్తున్నారు. డెమోక్రాట్లకు మెజారిటీ వచ్చినందున అక్కడి ఓటర్లు కూడా రిపబ్లికన్లను తిరస్కరించే అవకాశం లేకపోలేదు. ఉపాధ్యక్ష స్థానపు ఓటుతో డెమోక్రాట్లకు 51 ఓట్లతో మెజారిటీ ఖాయమైంది.

ఓట్ల లెక్కింపు సరళిని చూసిన అధ్యక్షుడు జో బైడెన్ గత బుధవారం నాడు చేసిన వ్యాఖ్యలు ఓటమిని పరోక్షంగా అంగీకరించటమేగాక రిపబ్లికన్లతో సఖ్యతకు సిద్ధమే అనే సంకేతాలిచ్చాడు. అంచనాలకు మించి డెమోక్రటిక్ పార్టీ మెరుగ్గా ఉన్నందుకు ప్రజాస్వామ్యానికి శుభదినం, రిపబ్లికన్ల గాలి వీస్తుందన్న మీడియా, ఎన్నికల పండితులు చెప్పిందేమీ జరగలేదు అని జో బైడెన్ చెప్పాడు. రద్దయిన దిగువ సభలో డెమోక్రటిక్ పార్టీకి 220, రిపబ్లికన్ పార్టీకి 212, మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రిపబ్లికన్లకు మెజారిటీ ఖరారైంది. ఓటింగ్ సరళి ప్రకారం రెండు పార్టీల తేడా తొమ్మిది సీట్లు ఉండవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. పార్లమెంటు ఎన్నికల చరిత్రను చూసినపుడు ఏ పార్టీ అధ్యక్ష స్థానాన్ని గెలుచుకొని అధికారానికి వస్తే రెండేళ్ల తరువాత జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రతిపక్షం మెజారిటీ సాధించటం ఒక ధోరణిగా ఉంది.



ఎం. కోటేశ్వరరావు

పార్లమెంటు మీద దాడిచేయించిన డోనాల్డ్ ట్రంప్ ఉగ్రవాదాన్ని సమర్థించిన అనేక మంది "మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్)" రిపబ్లికన్లు ఈ ఎన్నికల్లో ఓడిపోవటం ఒక్కటే బైడెన్‌కు ఊరటనిచ్చినట్లు కనిపిస్తోంది. రిపబ్లికన్ పార్టీ మొత్తంగా మితవాద శక్తులతో కూడినప్పటికీ దానిలో మాగా రిపబ్లికన్లు పచ్చి మితవాద ఫాసిస్టు, దురహంకార శక్తులు.



నేరాలను రిపబ్లికన్లు పెద్ద అంశంగా ఎన్నికల్లో ముందుకు తెచ్చారు. సర్వేల ప్రకారం అది ప్రధాన అంశమని కేవలం పదకొండు శాతం మాత్రమే పేర్కొన్నారు. ఆర్థికం, అబార్షన్లు, ప్రజాస్వామ్యం ప్రధాన అంశాలుగా చూశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలనే డెమోక్రాట్లకు జనం మద్దతు ఇచ్చినట్లు ఫలితాలు వెల్లడించాయి. ఈ రెండు పార్టీల మధ్య తేడా ప్రధానంగా దేశీయ రాజకీయాల్లోనే వుంటుంది. విదేశాంగ విధానంలో రెండూ ఏకాభిప్రాయంతో వ్యవహరిస్తాయి. వాల్‌స్ట్రీట్‌తో, మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌తో ఈ రెండు పార్టీలు అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి వుంటాయి. వారి ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు పోటీ పడుతుంటాయి. అందుకే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాలు హెచ్చరించాయి.

ఎన్నికల్లో ఓడినప్పటికీ రోజు రోజుకు పెరుగుతున్న మాగా రిపబ్లికన్ల మీద ఒక కన్నేసి ఉంచాలని ఎఎఫ్‌ఎల్-సిఐఓ కార్మిక సంఘం అధ్యక్షురాలు లిజ్ షులర్ హెచ్చరించారు. పోటీ తీవ్రంగా ఉన్న చోట్ల ప్రతి ఓటూ ఫలితాన్ని నిర్ధారిస్తుందని అందువలన కార్మికులు ఓట్ల లెక్కింపును జాగ్రత్తగా అనుసరించాలని పిలుపునిచ్చారు. వారు ప్రజాస్వామ్యానికి ప్రమాదకారులని చెప్పారు. అబార్షన్ హక్కు గురించి రాష్ట్రాలకు వదలి వేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వలన అనేక చోట్ల అబార్షన్ హక్కుకు మద్దతు ఇచ్చిన డెమోక్రాట్లకు జనం మద్దతు ఇచ్చారని షులర్ చెప్పారు. ఆర్థిక సవాళ్లు, గ్యాస్, ఆహార అధిక ధరలు రిపబ్లికన్ల వైపు ఓటర్లను నెడతాయని సాధారణ విశ్లేషణలు వెలువడినా మితవాద శక్తుల ఎజెండాను కూడా కార్మికులు తీవ్రమైనదిగా పరిగణించిన కారణంగానే మాగా శక్తులను ఓడించారు. మాగా రిపబ్లికన్లకు తీవ్ర ఎదురుదెబ్బలు తగిలినా వారి నేతగా ఉన్న డోనాల్డ్ ట్రంప్ పట్టు పార్టీ మీద ఇంకా ఉంది, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులలో 300 మందికి ట్రంప్ మద్దతు ఉంది. వారి మద్దతుతో 2024 ఎన్నికల్లో తిరిగి తాను పోటీ చేస్తానని చెబుతున్నాడు.

ఈ ఎన్నికలు ఖర్చు విషయంలో అమెరికా చరిత్రలోనే కొత్త రికార్డును సృష్టించాయి. ఓపెన్ సీక్రెట్స్ అనే సంస్థ అంచనా ప్రకారం 1670 కోట్ల డాలర్ల ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. మన కరెన్సీలో ఇది రు.1,37,000 కోట్లకు సమానం. ఇది ఎన్నికలకు వారం ముందు అంచనా, అనధికారికంగా అనేక మంది చేసిన ఖర్చు దీనిలో లేదు. పార్టీల అభ్యర్థుల ఎంపిక నుంచే డబ్బు ప్రవాహం మొదలౌతుంది. గత ఎన్నికల్లో పార్టీ వెలుపలి బృందాలు 160 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తే ఇప్పుడు అది 190 కోట్లకు పెరిగిందని అంచనా. జనాభాలో కేవలం 0.0003 శాతం ఉన్న బిలియనీర్లు ఎన్నికల ఖర్చులో పది శాతం కలిగి వుంటారని అంచనా. జార్జి సోరస్ 12.8 కోట్ల డాలర్ల ఖర్చుతో మొదటి స్థానంలో ఉన్నాడు. ఎక్కువ డబ్బు ఖర్చు చేసే అభ్యర్థులే ఎక్కువ మంది గెలిచినట్లు రెండు దశాబ్దాల సమాచారాన్ని క్రోడీకరించిన ఓపెన్ సీక్రెట్స్ సంస్థ పేర్కొన్నది. పార్లమెంటుకు పోటీ చేసి ఎక్కువ డబ్బు ఖర్చు చేసిన వారు 71 నుంచి 98 శాతం వరకు గెలిచినట్లు తేలింది. ప్రారంభంలో చేసే ఖర్చును బట్టి ఫలితాలను ఊహించుకోవచ్చు.

సాంకేతికంగా ఎంతో ముందున్న అమెరికాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతి లేదు. బ్యాలట్ పత్రాలనే వాడుతున్నారు. పోలింగ్ తేదీకి ముందే ఓట్లు వేసే అవకాశం కూడా ఉంది. మన దగ్గర విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలట్ మాదిరి ఏ ఓటరైనా వేయవచ్చు. ఇమెయిల్ ద్వారా ఓటు వేసి తరువాత బ్యాలట్ పత్రాన్ని పోస్టు ద్వారా పంపుతారు. ఈ కారణంగానే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వారాల తరబడి సాగుతున్నది.

వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో కూడా పచ్చి మితవాద శక్తులకు ఎదురు దెబ్బలు తగిలాయి. కొన్ని చోట్ల అక్రమాలకు పాల్పడి గెలిచిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఓహియోలో ఇలాంటి అక్రమాలకు పాల్పడిన కారణంగా 33 రాష్ట్ర అసెంబ్లీ సెనెట్ సీట్లకు గాను 1951 తరువాత తొలిసారిగా రిపబ్లికన్లు 26 సీట్లు తెచ్చుకున్నారు. సౌత్ కరోలినాలో కూడా తొలిసారిగా ఇలాగే మూడింట రెండు వంతుల సీట్లు తెచ్చుకున్నారు. డెమోక్రాట్లకు పట్టున్న న్యూయార్క్ రాష్ట్రంలో ఇలాంటి అక్రమాల కారణంగానే ఈసారి నలుగురు రిపబ్లికన్లు పార్లమెంటుకు అదనంగా గెలిచారు. రాష్ట్రాల అసెంబ్లీలను మొత్తంగా చూస్తే డెమోక్రాట్‌లే ఎక్కువ మంది ప్రతినిధులను కలిగి ఉన్నప్పటికీ ఎక్కువ రాష్ట్రాలలో గవర్నర్లు రిపబ్లికన్లు ఎన్నికయ్యారు. 1900 సంవత్సరం తరువాత కేవలం రెండు సార్లు మాత్రమే మధ్యంతర ఎన్నికల్లో అధికారంలో ఉన్న అధ్యక్షుడి పార్టీ రాష్ట్రాల చట్టసభల్లో మెజారిటీ సాధించింది.

రిపబ్లికన్ల గాలిని అడ్డుకున్నప్పటికీ అమెరికా కార్మిక వర్గానికి వారి నుంచి ఉన్న ముప్పును తక్కువ అంచనా వేయకూడదు. ప్రజాప్రతినిధుల సభలో మెజారిటీ ఉన్నందున కార్మిక అనుకూల ప్రతిపాదనలను అడ్డుకొనే అవకాశం ఉంది. జడ్జీల నియామకాలకు ఆటంకం కల్పించవచ్చు. నేరాలను రిపబ్లికన్లు పెద్ద అంశంగా ఎన్నికల్లో ముందుకు తెచ్చారు. సర్వేల ప్రకారం అది ప్రధాన అంశమని కేవలం పదకొండు శాతం మాత్రమే పేర్కొన్నారు. ఆర్థికం, అబార్షన్లు, ప్రజాస్వామ్యం ప్రధాన అంశాలుగా చూశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలనే డెమోక్రాట్లకు జనం మద్దతు ఇచ్చినట్లు ఫలితాలు వెల్లడించాయి. ఈ రెండు పార్టీల మధ్య తేడా ప్రధానంగా దేశీయ రాజకీయాల్లోనే వుంటుంది. విదేశాంగ విధానంలో రెండూ ఏకాభిప్రాయంతో వ్యవహరిస్తాయి. వాల్‌స్ట్రీట్‌తో, మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌తో ఈ రెండు పార్టీలు అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగివుంటాయి. వారి ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు పోటీ పడుతుంటాయి. అందుకే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాలు హెచ్చరించాయి.

జనవాక్యం

పాపం... రైతులు!

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. విత్తనం కొనుగోలు, ఎరువులు, రుణాలు పొందడం, పంట నమోదు, బీమా నుంచి పంట అమ్మకం, అమ్మిన పంటకు డబ్బు వచ్చే వరకు ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారు. నేతలు రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రగల్భాలు పలికారు. వడ్డీ లేని రుణాలు అన్నారు. ఏవీ లేవు. ఇక రైతు భరోసా కేంద్రాలు అవినీతి కేంద్రాలుగా మారాయి. విద్యుత్ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే నాణ్యమైన విద్యుత్ వస్తుందని హాస్యాస్పద ప్రకటనలు చేస్తున్నారు! అధికారం కోసం మభ్యపెట్టే బడాయి కబుర్లు, మోసపు మాటలు తప్పితే రైతుకు ఒరగబెట్టింది శూన్యం! రుణాల ఊబిలో చిక్కుకొని, ఆత్మాభిమానం దెబ్బ తిని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీనినిబట్టే రైతు కుటుంబాల దయనీయ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏలికలు ఇప్పటికైనా దేశానికి వెన్నెముక లాంటి రైతును ఆదుకోవాలి.

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

శ్రద్ధా వాకర్ కేసులో 10 శరీర భాగాలు స్వాధీనం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ దారుణ హత్య కేసులో మంగళవారం పది శరీర భాగాలను చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. 26 ఏళ్ల శ్రద్ధా వాకర్‌ను ఆమె ప్రియుడు 28 ఏళ్ల అఫ్తబ్ అమీన్ పూనావాల దారుణంగా హత్య చేయడంతోపాటు శ్రద్ధా శరీరాన్ని 35 భాగాలుగా చేసినట్లు చెప్పడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ కేసులో ఫ్రిడ్జ్, ఇతర సాక్ష్యాధారాలను పరిశీలించడానికి సిబిఐ ఫోరెన్సిక్ బృందం మంగళవారం ఢిల్లీలోని మెహ్రౌలి పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. అఫ్తబ్‌ను ఢిల్లీ పోలీసులు అడవిలోకి తీసుకెళ్లారు. మూడు గంటలపాటు గాలించి, 10 శరీరభాగాలను స్వాధీనం చేసుకున్నారు. అఫ్తభ్‌కు ఉరిశిక్ష విధించాలని మృతురాలి తండ్రి వికాస్ వాకర్ డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు... సిబిఐ విచారణకు హైకోర్టు నో

- బిజెపి పిటిషన్ తిరస్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేలకు ఎర కేసును సిబిఐకి అప్పగించడానికి హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఆధ్వర్యంలోనే దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించింది. సిట్ దర్యాప్తుపై స్టే విధించాలన్న బిజెపి నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం కోర్టు విచారించింది. సిబిఐతోగానీ, ప్రత్యేక దర్యాప్తు సంస్థతోగానీ విచారణ జరిపించాలన్న అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. కేసు విచారణ పురోగతిని ఈ నెల 29న జస్టిస్ విజయసేన్‌రెడ్డి బెంచ్‌కు అందించాలని సిట్‌ను ఆదేశించింది. దర్యాప్తునకు సంబంధించిన విషయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ లీక్ చేయొద్దని, సిట్ దర్యాప్తును జస్టిస్ విజయసేన్‌రెడ్డి పర్యవేక్షిస్తారని సిజె ఉజ్జల్ భుయాన్ తెలిపారు.

ఫీజులు తగ్గించాలని అలహాబాద్ యూనివర్శిటీ విద్యార్థుల మార్చ్

ప్రయాగ్‌రాజ్ : ఏడాదికి రూ.975గా ఉన్న అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల ఫీజును రూ.4,151కు పెంచడాన్ని నిరసిస్తూ అలహాబాద్ యూనివర్శిటీ విద్యార్థులు మంగళవారం 'జన ఆక్రోష్ మార్చ్'ను నిర్వహించారు. విద్యార్థి సంఘాలను పునరుద్ధరించాలని, పెంచిన ఫీజులను రద్దు చేయాలని యూనివర్శిటీ విద్యార్థులు 70 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నారు. యూనివర్శిటీ అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం మార్చ్ నిర్వహించారు.

మిజోరంలో కుప్పకూలిన రాతి క్వారీ : ఎనిమిది మంది మృతి

ఐజ్వాల్ : మిజోరంలోని హ్నథియాల్ జిల్లాలో ఓ రాతి క్వారీ కుప్పకూలింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, నలుగురు గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. బాధితుల గుర్తింపు ఇంకా జరగలేదని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

భాగస్వామ్య సంబంధాలపై మోడీ, బైడెన్ సమీక్ష

బాలి : కీలకమైన, కొత్తగా ఆవిర్భవిస్తున్న సాంకేతికతలు, కృత్రిమ మేధస్సు వంటి రంగాలతో సహా భారత్, అమెరికా మధ్య గల వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలను ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు బైడెన్ మంగళవారం సమీక్షించారు. ఇక్కడ జరుగుతున్న జి-20 సదస్సుకు హాజరైన వీరిరువురు అంతర్జాతీయ, ప్రాంతీయ పరిణామాలపై కూడా చర్చించారని భారత విదేశాంగ శాఖ (ఎంఇఎ) తెలిపింది. ఉక్రెయిన్ యుద్ధం, దాని పర్యవసానాలు వీరి చర్చల్లో ప్రధానంగా వచ్చినట్లు తెలుస్తోంది. క్వాడ్, ఐ2యు2 వంటి కొత్త గ్రూపుల్లో ఇరు దేశాల మధ్య సన్నిహిత సహకారం పట్ల కూడా ఇరువురు నేతలు సంతృప్తిని వ్యక్తం చేశారని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు మద్దతిస్తున్నందుకు బైడెన్‌కు మోడీ కృతజ్ఞతలు తెలియజేశారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

రష్యా, ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలను హింసించాయి : ఐరాస

జెనీవా : దాదాపు తొమ్మిది మాసాలుగా జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా, ఉక్రెయిన్లు రెండూ తమ యుద్ధ ఖైదీలను హింసించాయని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి మంగళవారం తెలిపింది. ఖైదీలను విద్యుత్ షాక్‌లకు గురి చేయడం, వారిచే బలవంతంగా దుస్తులు విప్పించడం వంటి వాటితో సహా పలు చర్యలకు పాల్పడ్డాయని పేర్కొంది.

నేడే ఆర్టిమిస్ 1 రాకెట్ ప్రయోగం

ఫ్లోరిడా : మెగా మూన్ రాకెట్ ఆర్టిమిస్ 1ను నాసా బుధవారం ఫ్లోరిడా నుంచి ప్రయోగించనుంది. గతంలో రెండుసార్లు విఫల ప్రయత్నాలు జరిగిన అనంతరం మూడోసారి ఈ ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు ఆర్టిమిస్ మిషన్ మేనేజర్ మైక్ సారాఫిన్ తెలిపారు. ఇప్పటికే కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఖగోళ శాస్త్రవేత్తలు లేకుండా సాగే ఈ ప్రయోగం చంద్రునిపై శాశ్వత నివాసం నిర్మించే దిశగా నాసా ప్రయత్నాల్లో తొలి చర్య. భవిష్యత్తులో అక్కడ నుండి అంగారక గ్రహంపైకి పయనించడానికి సిద్ధం కావాలన్నది నాసా ఆలోచనగా వుంది. గ్రీక్ పురాణాల్లోని అపోలో సోదరి పేరు ఆర్టిమిస్‌ను దీనికి పెట్టారు. చంద్రునిపైకి మానవుడు కాలూనిన 50 ఏళ్ల తర్వాత ఈ కొత్త రోదసీ కార్యక్రమం చేపడుతున్నారు.

పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాల్సిందే

- యుపిలో వేలాదిమంది ఉపాధ్యాయుల ఆందోళన



లక్నో : నూతన జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్)కు వ్యతిరేకంగా మంగళవారం ఉత్తరప్రదేశ్‌లో ఉపాధ్యాయులు కదంతొక్కారు. లక్నోతో పాటు జిల్లా కేంద్రాల్లోనూ భారీ ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూల నుంచి వచ్చిన వేలాదిమంది ఉపాధ్యాయులు లక్నోలోని ఇకో గార్డెన్ వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను మళ్లీ అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వచ్చే నెలలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లోపు తమ డిమాండ్ అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్ ప్రాథమిక్ శిక్షక్ సంఘ్ (యుపిపిఎస్ఎస్) ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ఈ ఆందోళనలు చేశారు. కొత్త పెన్షన్ పథకం ఉద్యోగులకు శాపం వంటిదని, అందుకే రద్దు చేయాలని పోరాటం చేస్తున్నామని యుపిపిఎస్ఎస్ అధ్యక్షులు సుశీల్ కుమార్ పాండే తెలిపారు. రాష్ట్రంలోని 75 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కొత్త పథకానికి వ్యతిరేకంగా పదేళ్ల నుంచి పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పాండే విమర్శించారు. ఎన్‌పిఎస్‌తో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పదవీ విరమణ పొందిన కొంతమంది ఉద్యోగులు ఎన్‌పిఎస్ కింద పొందుతున్న పెన్షన్‌తో విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాటు పదవీలో ఉండే ఎంపిలు, ఎమ్మెల్యేలు జీవిత కాల పెన్షన్ పొందుతూ ఉంటే.. 30 ఏళ్లు పాటు ఉద్యోగం చేసినవారికి పదవీ విరమణ తరువాత సరైన పెన్షన్ చెల్లించడం లేదని విమర్శించారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించకపోతే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇదే కీలక అంశంగా మారుతుందని ఉద్యోగులు హెచ్చరించారు. ఎన్నికలకు ముందు సుమారు ఏడు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఎన్‌పిఎస్‌కు వ్యతిరేకంగా నిరసనలకు దిగుతారని తెలిపారు.

లక్షకు పైగా గ్రామాల్లో ఎఐకెఎస్ ఫ్లాగ్ డే

- ఘనంగా గిరిజన విప్లవకారుడు బిర్సాముండా జయంతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గిరిజన విప్లవకారుడు బిర్సా ముండా స్మారకార్థం దేశవ్యాప్తంగా లక్షకు పైగా గ్రామాల్లో ఎఐకెఎస్ జెండా ఆవిష్కరణ (ఫ్లాగ్ డే)లు నిర్వహించింది. ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభ డిసెంబర్ 13 నుంచి 16 వరకు కేరళలో త్రిసూర్‌లో జరగనున్న నేపథ్యంలో స్వాతంత్ర సమరయోధుడు బిర్సాముండా 148వ జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగా మంగళవారం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బిర్సాముండా జయంతి ఘనంగా జరిగింది. ఢిల్లీలోని ఎఐకెఎస్ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ కోశాధికారి పి.కృష్ణప్రసాద్, ఐద్వా ఉపాధ్యక్షురాలు సుభాషిణి అలీ, ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్, హర్యానా, ఒరిస్సా, మధ్యప్రదేశ్, త్రిపుర, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్, రాజస్థాన్, కేరళ, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో జెండా ఆవిష్కరణలు జరిగాయి.



ఢిల్లీలో ఎఐకెఎస్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న హన్నన్ మొల్లా

జనజాతీయ గౌరవ దివస్ సందర్భంగా రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

జనజాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంగళవారం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన నాయకులు బిర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ దివస్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గిరిజన ప్రజలు తమ కళలు, చేతి వృత్తులు, కృషితో దేశాన్ని సుసంపన్నం చేశారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటానికి గిరిజన ప్రజలు గొప్ప సహకారం అందించారని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. బిర్సా ముండా, ఇతర గిరిజన వీరుల కలలను నెరవేర్చడానికి దేశం ముందుకు సాగుతుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

సిపిఎం ఘననివాళి

భూస్వామ్య ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు, గిరిజన నేత, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయనకు సిపిఎం నివాళులర్పించింది. ఆయనను స్మరించుకుంటూ, ఆయన పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొంది.

టెండర్ లేకుండా ఒప్పందమా..?

- మోర్బి బ్రిడ్జి విషాద ఘటన కేసులో గుజరాత్ ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు

గాంధీనగర్ : మోర్బి బ్రిడ్జి నిర్వహణ, రిపేరు కోసం ఒరెవా సంస్థతో 15 ఏళ్లకు ఒప్పందం కుదుర్చుకోవడంపై గుజరాత్ ప్రభుత్వాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు మంగళవారం నిలదీసింది. నిర్వహణ, రిపేరు పనులకు టెండర్ వేయకుండా, ఆసక్తిదారులను ఆహ్వానించకుండా ఒక ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టును అప్పగించడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 2017లోనే పూర్వపు ఒప్పందం ముగిసినా, రెండేళ్ల తరువాత కూడా బ్రిడ్జిని నిర్వహించుకునేందుకు, అద్దె వసూలు చేసుకోవడానికి ఒక ప్రైవేటు సంస్థను అనుమతించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్టోబర్ 30న మోర్బి బ్రిడ్జి కూలిన ఘటనలో 135 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ సందర్భంగా మంగళవారం గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు తీవ్ర స్థాయిలో మందలించింది. ఈ ఏడాది మార్చిలో ఒరెవా సంస్థకు మోర్బి మున్సిపాలిటీకి మధ్య కుదిరిన ఒకటిన్నర పేజీల ఒప్పందంపై ప్రభుత్వాన్ని నిలదీసింది. గుజరాత్ మున్సిపాలిటీల చట్టంలో సెక్షన్ 65కు ఈ ఒప్పందం లోబడి ఉందా? అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్ ప్రశ్నించారు. రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

గ్రామ న్యాయాలయాల ఏర్పాటుపై స్పందన తెలపండి

- హైకోర్టులకు సుప్రీంకోర్టు నోటీసులు
- కేరళ అనుభవాలను పంచుకుంటూ అఫిడవిట్ ఇవ్వాలని ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గ్రామ న్యాయాలయాల ఏర్పాటుపై స్పందన తెలపాలని దేశంలోని హైకోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. గ్రామ న్యాయాలయ చట్టం-2008 అమలు చేసేలా, గ్రామ న్యాయాలయాలు ఏర్పాటుచేసేలా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఫర్ ఫాస్ట్ జస్టిస్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, జస్టిస్ వి రామసుబ్రమణియన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌లకు నోటీసులు జారీచేసింది. గ్రామ న్యాయస్థానాలను ఏర్పాటుచేసిన కేరళ వంటి రాష్ట్రాల అనుభవాలను పంచుకుంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ పిటిషన్‌లో తీర్పు ఇవ్వడానికి హైకోర్టుల స్పందన కూడా అవసరమని పేర్కొన్న ధర్మాసనం, ఈ కేసులో హైకోర్టులను ప్రతివాదులుగా చేర్చింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ దాదాపు 14 ఏళ్ల క్రితమే చట్టాన్ని ఆమోదించినా, చాలా రాష్ట్రాలు ఒక్క గ్రామ న్యాయాలయాన్ని కూడా ఏర్పాటుచేయలేదని అన్నారు. సిపిసి, సిఆర్‌పిసి కఠినమైన విధానానికి కట్టుబడి ఉండేందుకు గ్రామ న్యాయస్థానాల స్థాపనను చట్టం పేర్కొందనీ, నిర్దేశిత స్వభావం గల చిన్న కేసులను పరిష్కరించేందుకు వీలు కల్పిస్తుందని తెలిపారు. చట్టంలో "షల్" అనే పదానికి బదులు "మే" అనే పదాన్ని ఉపయోగించడం వల్ల రాష్ట్రాలు గ్రామ న్యాయాలయాల ఏర్పాటు తప్పనిసరి కాదని కేంద్ర ప్రభుత్వం వైఖరి తీసుకుందని ధర్మాసనానికి తెలిపారు. కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి చాలా తక్కువ రాష్ట్రాలే ఈ చట్టాన్ని అమలు చేశాయని ఆయన తెలిపారు. గ్రామ న్యాయాలయాల ఏర్పాటును ఏ రాష్ట్రమైనా వ్యతిరేకిస్తుందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు సిఫార్సు చేసినప్పటికీ హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని ప్రశాంత్ భూషణ్ బదులిచ్చారు. బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు కూడా వ్యతిరేకిస్తున్నాయని ఆయన తెలిపారు. తమిళనాడులో ఇప్పటి వరకు ఒక్క గ్రామ న్యాయాలయాన్ని ఏర్పాటు చేయలేదని తెలిపారు. జార్ఖండ్ అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది తపేష్ కుమార్ సింగ్ వాదనలు వినిపిస్తూ ఈ చట్టానికి, షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన చట్టాలకు మధ్య వైరుధ్యం ఉందని, అందుకే తమ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల పరిపాలనకు సంబంధించి ఈశాన్య రాష్ట్రాలకు చట్టం మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. నిబంధనలను రూపొందించడం, నియామకాలను హైకోర్టులతో సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వాలు చేయవలసి ఉన్నందున, ఈ కేసులో హైకోర్టులు కూడా పార్టీలుగా ఉండాలని తెలిపారు. దీంతో ఈ కేసులో హైకోర్టులను కూడా పార్టీలుగా చేర్చాలని ధర్మాసనం నిర్ణయించింది.

ప్రజాప్రతినిధుల విద్వేషపూరిత ప్రసంగాలు రాజ్యాంగ బద్ధమా? : సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : ఆర్టికల్ 19(2) విధించిన పరిమితుల కంటే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతోసహా ప్రజా ప్రతినిధులు మాట్లాడే వాక్ స్వాతంత్ర్యం కలిగి ఉండాలా? వద్దా? అనేదానిపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. మంత్రులతో సహ ప్రజాప్రతినిధులకు స్వచ్ఛంద ప్రవర్తనా నియమావళిని సూచిస్తున్నామని, దీనిని పరిష్కరించడానికి ప్రత్యేక విధానాన్ని సూచిస్తున్నామని పేర్కొంది. ఒక వ్యక్తి ప్రకటన దేశానికి వ్యతిరేకంగా ఉండకపోవచ్చు, కానీ దాని కారణంగా దేశ ప్రజల్లో ఒకవర్గం ప్రభావితమైతే అప్పుడేం చేస్తామని ప్రశ్నించారు. ఎంపీలు, ప్రధాని, రాష్ట్రపతి కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేసిన 20 సందర్భాలను సూచించామని న్యాయవాది రాజ్ తెలిపారు. 2014 తరువాత ద్వేషపూరిత ప్రసంగాల సంఖ్యలో 450 శాతం పెరిగిందనీ, వీటిలో ప్రధాన భాగం మంత్రులు, ఎంపీలతోసహ ప్రజాప్రతినిధులే ఉన్నారని తెలిపారు.

ప్రపంచ జనాభా 800 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

దేశాలు వున్నాయి. తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో జననాల రేటు పెరుగుదల వల్ల మరింత ముప్పు తలెత్తే ప్రమాదం వుందని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. 1927లో భూ మండలం మీద జనాభా 200కోట్లుగా వుంది, 1998నాటికి 600కోట్లకు చేరుకుంది. 1950 నుంచి వార్షిక జనాభా పెరుగుదల రేటు చాలా తక్కువ స్థాయిలో వుంది. ప్రపంచ జనాభా మరో వంద కోట్లు దాటడానికి ప్రస్తుతం 12 సంవత్సరాలు పట్టింది. ఆ తదుపరి మైలురాయిని చేరడానికి 15 ఏళ్లు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. 2037 నాటికి 900 కోట్లకు, 2058నాటికి వెయ్యి కోట్లకు జనాభా చేరుతుందని అంచనా వేశారు.

సంపన్న దేశాల్లో మందగమనం

జననాల్లో మందగమనమనేది ప్రధానంగా సంపన్న దేశాల్లో కనిపిస్తోంది. దక్షిణ కొరియా నుంచి ఫ్రాన్స్ వరకు గల దేశాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా వుంది.

జోక్యం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన బహిరంగ సభకు కేరళ వర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్, హెచ్ఇపిఎఫ్ నేత బి.ఇక్బాల్ అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా వ్యవస్థ నాణ్యతను మెరుగుపరచడానికి అందరితో కలిసి కృషి చేయడానికి బదులుగా గవర్నర్ తనకిష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

గవర్నర్ కార్యాలయాన్ని ఆయుధంగా వాడుతున్నారు : ఏచూరి

సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ, "భారతదేశ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేసే ఒక వింత, అనారోగ్య పరిస్థితిని మనం ఎదుర్కొంటున్నాం." అని అన్నారు. బిజెపియేతర పార్టీలు పాలించే రాష్ట్రాల్లో గవర్నర్ కార్యాలయాన్ని ఒక ఆయుధంగా వాడుతున్నారని విమర్శించారు. భారతదేశాన్ని ఫాసిస్ట్ హిందూత్వ రాష్ట్రంగా మార్చేందుకు బిజెపి-ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు గవర్నర్ల కార్యాలయాలను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. విద్యను, యువత చైతన్యాన్ని నియంత్రించడం ద్వారా వారి లక్ష్యాన్ని సాధించాలని చూస్తున్నారని అన్నారు. విద్యా రంగాన్ని కాషాయీకరణ చేయడానికి ఉద్దేశించిన బిజెపి విధానాలను ఏచూరి తీవ్రంగా విమర్శించారు. తన అదుపులోకి ఉన్నత విద్యా రంగాన్ని తెచ్చుకోవడానికి ఉద్దేశించిన ఈ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. పరిపాలన సజావుగా సాగేందుకు గవర్నర్లు, యూనివర్శిటీల ఛాన్సలర్ల పాత్రను తగ్గించేందుకు ఇప్పటికే తమిళనాడు, బెంగాల్, తెలంగాణా వంటి బిజెపియేతర పాలిత రాష్ట్రాలు చట్టాలను సవరించాయి. "యూరప్‌లోని దేశాలతో సమానంగా పలు విజయాలకు దారి తీసే చాలా బలమైన, క్రియాశీలమైన వ్యవస్థ మనకు వుంది. దాన్ని నాశనం చేయాలని బిజెపి భావిస్తోంది. ఇందుకు గానూ గవర్నర్ కార్యాలయాన్ని ఒక సాధనంగా వాడుకుంటోంది." అని ఏచూరి విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పాత్ర పోషించాల్సిన గవర్నర్‌ను బిజెపి తన రాజకీయ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు వాడుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగం తనకు అప్పగించిన అధికారాలకు అనుగుణంగా గవర్నర్ వ్యవహరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కన్నమ్ రాజేంద్రన్ కోరారు.

రాజ్యాంగాన్ని, లౌకిక విలువలను కాపాడాలి

రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను ప్రభావితం చేసే విధానాలపై కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష ధోరణిని ఎల్‌డిఎఫ్ నేతలు తీవ్రంగా విమర్శించారు. 2019లో జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఇపి) అమలు చేసేందుకు జరిగే ప్రయత్నాలను ఆనాడు రాజ్యసభలో సిపిఎం వ్యతిరేకించిందని, కానీ కోవిడ్ సమయంలో బిజెపి చట్టాన్ని తీసుకువచ్చిందని వారు తెలిపారు. ర్యాలీనుద్దేశించి డిఎంకె ఎంపి తిరుచి శివ ప్రసంగించారు. ఉమ్మడి జాబితా నుండి విద్యను తిరిగి రాష్ట్ర జాబితాకు తీసుకురావాలన్నారు. ఎన్నికైన ప్రభుత్వాల నిర్ణయాలను సవాలు చేసే అధికారం గవర్నర్‌కి ఎవరు ఇచ్చారని శివ ప్రశ్నించారు. సమాఖ్యవాదం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఉమ్మడి పోరాటాన్ని జరపాల్సిన అవసరం వుందని అన్నారు. హిందీని జాతీయ భాషగా రుద్దేందుకు బిజెపి చేస్తున్న యత్నాలను పలువురు నేతలు విమర్శించారు.

పలుచోట్ల ర్యాలీలు, సభలు

గవర్నర్ వ్యవహార శైలిని నిరసిస్తూ జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించాల్సిందిగా ఎల్‌డిఎఫ్ పిలుపునిచ్చింది. పాలక్కాడ్ సభలో కేరళ రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి, సిపిఎం నేత టి.ఎం.థామస్, కన్నూరులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, కాసర్‌గోడ్‌లో కేంద్ర కమిటీ సభ్యులు కెకె శైలజ, శ్రీమతి టీచర్, పథనంతిట్టలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెకె జయచంద్రన్, జనతాదళ్ నాయకుడు నీలలోహితాదాసన్ నాడార్ పాల్గొన్నారు.



బుర్రిపాలెంలోని కృష్ణ నివాసం వద్ద గ్రామస్తుల నివాళి

బుర్రిపాలెంలో విషాదఛాయలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

తెలుగు సినీ ప్రపంచానికి కొత్త సొబగులు అద్దిన సూపర్ స్టార్ కృష్ణ ఇక లేరు. హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి కుటుంబ సభ్యులను, సినీ రంగాన్ని, అభిమానులను, బుర్రిపాలెం గ్రామాన్ని విషాదంలోకి నెట్టింది. స్వగ్రామం బుర్రిపాలెంను దత్తత గ్రామంగా తీసుకుని అభివృద్ధి చేశారన్నారు. సినీ నటులు కృష్ణ ఎక్కడున్నా గ్రామాభివృద్ధికి తోడ్పడేవారన్నారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, అలాగే సిమెంట్ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో గీతా మందిరం ఆయన పుణ్యమేనని తెలిపారు. గ్రామంలో ప్రజల ఆరోగ్యం కోసం ఉచితంగా విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ బృందంతో హెల్త్ క్యాంపులు నిర్వహించేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆరోగ్యం బాగాలేదని తెలిసినప్పుడే ఎంతో వేదన పడ్డాం. మంచి మనిషిని కోల్పోయామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బుర్రిపాలెంలోని కృష్ణ స్వగృహం వద్ద ఆయన కటౌట్‌పెట్టి, చిత్రపటానికి గ్రామస్తులు నివాళులర్పించారు.

పాఠశాలను ఎంతగానో అభివృద్ధి చేశారు : జి లలిత ప్రసాద్, హెచ్ఎం

గ్రామంలో ఘట్టమనేని నాగరత్నమ్మ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. హైస్కూల్‌కు 1982లో ప్రభుత్వ అనుమతించింది. దానికి అనుగుణంగా కృష్ణ స్పందించి 1985లో 4 తరగతి గదులు ఏర్పాటు చేశారు. అలాగే ఇటీవల కాలంలో విద్యార్థుల కోసం 10 కంప్యూటర్లను కూడా వితరణ చేశారు. రోటరీ క్లబ్ ద్వారా బెంచీలు ఏర్పాటు చేయించారు. మొత్తం మీద పాఠశాల అభివృద్ధిలో ఎంతో కీలకంగా ఉన్న కృష్ణ గారిని కోల్పోవడం బాధాకరం.

సూపర్ స్టార్ కృష్ణ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

జాముున నాలుగు గంటల ప్రాంతంలో ఆయన తుది శ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన భౌతిక కాయాన్ని నానక్‌రామ్‌గూడలోని నివాసానికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. బుధవారం మధ్యాహ్నం మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. కృష్ణ మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లు విశ్వభూషణ్ హరిచందన్, తమిళిసై, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కెసిఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కృష్ణ నివాసానికి వెళ్లి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు పరామర్శించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ,కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి, మంత్రులు కెటిఆర్, తలసాని, పువ్వాడ అజయ్, ప్రశాంత్ రెడ్డి, నటులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కృష్ణ భౌతిక కాయాన్ని మంగళవారం మధ్యాహ్నంనుండి గచ్చిబౌలి లోని స్టేడియంకు తరలించి అభిమానుల సందర్శనార్థం ఉంచాలని తొలుత నిర్ణయించారు. అయితే, ట్రాఫిక్ ఆంక్షల కారణంగా ఈ నిర్ణయాన్ని మార్చుకుని నానక్‌రామ్‌గూడలోని నివాసం వద్దే ఉంచారు. రాత్రి 10.30 గంటల సమయంలో కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు అంతిమనివాళులర్పించడానికి తరలివస్తూనే ఉన్నారు. బుధవారం ఉదయం పద్మాలయ స్టూడియోకి కృష్ణ భౌతిక కాయాన్ని తరలించనున్నారు. అక్కడ మధ్యాహ్నం 12.30 గంటలవరకు ఉంచి, ఆతరువాత మహాప్రస్థానంలో అంతిమక్రియలను నిర్వహిస్తారు.

జీవన ప్రస్థానం..

1943 మే 31న గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని బుర్రిపాలెంలో ఘట్టమనేని వీరరాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతులకు కృష్ణ జన్మించారు. ఆయన పూర్తిపేరు ఘట్టమనేని శివరామకృష్ణ మూర్తి. చిన్నప్పటి నుండి ఆయనకు సినిమాలపై ఎంతో ఆసక్తి ఉండేది. 1965లో కృష్ణ ఇందిరను వివాహం చేసుకున్నారు. వీరికి రమేష్‌బాబు, మహేశ్‌బాబు, పద్మావతి, ప్రియదర్శిని, మంజుల సంతానం, ఆ తరువాత సినీ నటి దర్శకురాలు విజయనిర్మలను వివాహం చేసుకున్నారు. ఆయన ఇద్దరు భార్యలతో పాటు కుమారుడు రమేష్‌బాబు కూబా ఇటీవలే మరణించారు.

రాజకీయాలలో... సినిమాతెరపైనే కాకుండా రాజకీయాల్లోనూ కృష్ణ తనదైన ముద్ర వేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీపై అభిమానంతో 1984లో కాంగ్రెస్ పార్టీలో కృష్ణ చేరారు. 1989లో ఆ పార్టీ తరుపున ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1991 ఎన్నికల్లో మరోసారి ఏలూరు నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత రాజీవ్ గాంధీ హత్యకు గురికావడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు.

నేడు హైదరాబాద్‌కు జగన్

కృష్ణకు అంతిమనివాళుర్పించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఈ మేరకు ఆయన కార్యక్రమం ఖరారైంది. ఉదయమే హైదరాబాద్‌కు చేరుకుని నివాళులర్పిస్తారని సిఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. అంతకు మందు విడుదల చేసిన ప్రకటనలో కృష్ణ మృతి తెలుగు సినీరంగానికి తీరనిలోటని సిఎం జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

సిపిఎం సంతాపం

కృష్ణ మృతి పట్ల సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కృష్ణ 340 సినిమాలకుపైగా చిత్రాల్లో హీరోగా నటించారని, అత్యంత ప్రతిష్టాత్మకమైన అల్లూరి సీతారామరాజులాంటి దేశభక్తి సినిమాలను నిర్మించారని పేర్కొన్నారు. రాయలసీమకు కరువు వచ్చినప్పుడు సినీఇండస్ట్రీ జోలెపట్టి నిధులు వసూలు చేసిన సందర్భంలో ఒక బృందానికి నాయకుడిగా కృష్ణ ఉన్నారని తెలిపారు. ఉదార స్వభావుడిగా సినీ పరిశ్రమలో ఆయనకు పేరుందని పేర్కొన్నారు. మహేశ్‌బాబు తదితర కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తెలంగాణ సిపిఎం కమిటీ కూడా కృష్ణ మృతికి నివాళులర్పించింది.

స్ఫూర్తివంతమైన చిత్రాలు తీశారు : పిఎన్ఎం

ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు బృందంలో, ఆయన దర్శకత్వంలో నాటకాలు ప్రదర్శిస్తూ అనంతరం సినీ రంగంలోకి వెళ్లిన కృష్ణ పలు స్ఫూర్తివంతమైన చిత్రాలు తీశారని ప్రజానాట్యమండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్.అనిల్ పేర్కొన్నారు.

సినీ జగతికి కృష్ణ ధ్రువతార : సిపిఐ

సినీ జగతికి కృష్ణ ధృవతారని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సినిమాల్లో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు చిత్రం ద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించారని వివరించారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సినీరంగంలో సాహసోపేతమైన వ్యక్తి : కాంగ్రెస్

తెలుగుసినీ రంగంలో సాహసోపేతమైన వ్యక్తి సూపర్ స్టార్ కృష్ణని, ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి లోటని పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్ తెలిపారు.

విజన్ డ్రగ్స్ ఫార్మా కర్మాగారంలో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ప్రమాద స్థలాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు పరిశీలించారు.

యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం : సిఐటియు


యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.భరత్ అన్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికులు ధర్నా చేశారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

రూ.20 లక్షల చొప్పున పరిహారం : కలెక్టర్

విజన్ డ్రగ్స్ ఫార్మా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించిందని కలెక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. పూర్తి స్థాయి విచారణకు ఆదేశించామని తెలిపారు. పరిహారంతోపాటు బాధిత కుటుంబాల్లో ఒకరికి కంపెనీలో ఉద్యోగం కల్పిస్తామన్నారు. అంతిమ సంస్కారాలు కోసం తక్షణ సాయంగా కంపెనీ తరపున ఒక్కొక్కరికి రూ.2.50 లక్షలు ఆర్థిక సాయం అందించారని తెలిపారు.



కొమ్ముల దుప్పి



అడవిలో ఒక దుప్పికి చాలా పొడవైన కొమ్ములు ఉండేవి. దాని కొమ్ములు చూసి అన్ని దుప్పులు 'కొమ్ముల దుప్పి... కొమ్ముల దుప్పి' అని ఎగతాళి చేసేవి. అయినా అది ఎవరిని పట్టించుకునేది కాదు. ఒకసారి అన్ని దుప్పులు పచ్చికమేసే సమయంలో వాటికి ఒక పెద్ద పులి గాండ్రింపు వినిపించింది. వెంటనే దుప్పులు అన్నీ భయపడి పరుగు తీశాయి. అడవిలో చెట్లు దట్టంగా ఉండటంతో అవి చెల్లాచెదరుగా పరిగెత్తాయి. కొమ్ముల దుప్పి కూడా పరుగెత్తింది. కాని దీని కొమ్ములు రెండు చెట్ల మధ్య చిక్కుకుని అది ఆగిపోయింది.

ఈ లోపల పెద్దపులి గాండ్రిస్తూ దాని వద్దకు వచ్చింది. అప్పుడు ఆ దుప్పికి ఏం చేయాలో తోచలేదు. ఇక తనకు మరణం తథ్యమని భయపడసాగింది. ఆ చెట్ల మధ్య నుంచి కొమ్ములు విడిపించుకునే ప్రయత్నం చేసింది. వెంటనే కొమ్ములు చెట్ల మధ్య నుంచి విడిపడ్డాయి. వెంటనే ధైర్యం తెచ్చుకుని వెనక్కు తిరిగి ఆ పులిని వేగంగా పరిగెత్తుకొని వచ్చి ఢీకొంది. దాని కొమ్ములు పెద్దపులి శరీరంలో దిగబడి, ఆ పులి గాయపడి వెంటనే అక్కడి నుంచి పారిపోయింది.

చెట్లచాటున ఉండి గమనిస్తున్న మిగతా దుప్పులు అన్నీ దాని వద్దకు వచ్చాయి. 'నీవేంటి? ఆ పెద్దపులితోనే ధైర్యంగా పోరాడావు. ఇన్నాళ్లు మేము ఎంత ఆటపట్టించినా ఊరుకున్నావు. దాంతో నీవు పిరికిదానివి అనుకున్నాం. నీవు ఇంత సాహసం చేయకుంటే మనలో ఎవరో ఒకరు దానికి ఆహారం అయ్యేవాళ్లం' అని అన్నాయి.

అప్పుడు ఆ కొమ్ముల దుప్పి 'మన ధైర్యాన్ని, బలాన్ని బలహీనుల మీద ప్రదర్శించకూడదు. మీరంతా నా లోపంగా చూసే ఈ కొమ్ములే ఈ రోజు మనల్ని కాపాడాయి. ఎదుటివారి శక్తి సామర్థ్యాలు తెలుసుకోకుండా ఒక నిర్ణయానికి రావడం తప్పు' అని అంది. అప్పుడు మిగతా దుప్పులన్నీ కొమ్ముల దుప్పితో తమను క్షమించమని కోరాయి. అది చూపిన ధైర్యానికి అభినందించాయి.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
99085 54535

నేను గీసిన బొమ్మ




- సయ్యద్ ముజఫ్ఫర్,
4వ తరగతి,
శాంతినికేతన్,
ఇంగ్లీషు మీడియం స్కూలు,
అనంతసాగరం, నెల్లూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సాహసమే ఊపిరిగా ...



తొలి 70 ఎంఎం చిత్రం, తొలి జేమ్స్ బాండ్ చిత్రం, తొలి కౌబాయ్ చిత్రం, తొలి ఫుల్ స్కోప్ చిత్రం, తొలి ఈస్ట్ మాన్ కలర్, తొలి డీటీయస్ సినిమా.. ఇలా చెప్పుకుంటే పోతే కృష్ణ సినీప్రస్థానంలో ఎన్నో ప్రయోగాలు. సాంకేతికతను అందిపుచ్చుకుని ఇండస్ట్రీలో నూతన ఒరవడికి బీజం వేయడంలో ఆద్యుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రపంచ చలనచిత్ర రంగంలోనే తెలుగు పరిశ్రమకు ఖ్యాతి తెచ్చిన నటుడిగా ఘట్టమనేని కృష్ణ ఉంటారు. సూపర్‌స్టార్‌గా అభిమానుల గుండెల్లో చెరగని ముద్రవేసిన ఆయన సినీ ప్రస్థానం సాహసమే ఊపిరిగా.. ధైర్యమే ఆయుధంగా సాగింది. పౌరాణికం, సాంఘికం, జానపదం, జేమ్స్‌బాండ్ చిత్రాల్లోనే కాదు చారిత్రక నేపథ్య వ్యక్తులను అత్యంత ప్రభావవంతంగా తెరపై చూపించిన ప్రతిభ ఆయనది. వెండితెరపై కృష్ణ సృష్టించిన సంచలనాలకు కొదవలేదు.

1945 మే 31న గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో ఘట్టమనేని రాఘవయ్య, నాగరత్నమ్మ దంపతులకు తొలి సంతానంగా కృష్ణ జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు శివరామకృష్ణమూర్తి. చదువుకునే రోజుల్లోనే నటన పట్ల ఆసక్తితో చిత్రరంగం వైపు అడుగులు వేశారు.

తొలినాళ్లలో ప్రజానాట్య మండలి తరపున గరికపాటి రాజారావు ఆధ్వర్యంలో నాటకాలు వేశారు. అడపాదడపా నాటకాలు వేస్తూ నటనపై ఆసక్తి పెంచుకున్న ఆయన ఆ తరువాత మద్రాసుకు మకాం మార్చారు. ఐదున్నర దశాబ్దాలకు పైగా చలనచిత్ర రంగంపై చెరగని ముద్రవేసిన ఆయన తొలి సినిమా 1964లో విడుదలైన 'తేనె మనసులు'. హీరోగా పరిచయం కాకముందు 'కులగోత్రాలు' (1961), 'పదండి ముందుకు' (1962), 'పరువు ప్రతిష్ట' (1963) లాంటి సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేశారు.

చాలా తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేయడం ఆ తరం నటుల్లో చూస్తాం. అందులోనూ కృష్ణ మరీ ప్రత్యేకం. అలా ఏడాదికి పదికి పైగా సినిమాలు చేసేవారు. ఒక ఏడాది 17 సినిమాల్లో నటించారు. 9 ఏళ్లలో అన్ని పాత్రలు కలుపుకుని 100 సినిమాలు చేశారు. వందవ సినిమాగా వచ్చిన 'అల్లూరి సీతారామరాజు' చలనచిత్రరంగంలో ఓ ప్రభంజనం. అప్పటివరకు కృష్ణ నటించిన చిత్రాలన్నీ ఒక ఎత్తయితే, ఈ సినిమా ఒక్కటీ మరో ఎత్తు. సంభాషణలు పలికే తీరు, హావభావాలు ప్రదర్శించే విధానం, ఆహార్యం వంటి విషయాల్లో ఆయన తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ అశేష అభిమానులకు దగ్గర చేసింది. ఈ సినిమా 17 కేంద్రాల్లో శతదినోత్సవంతో భారీ విజయాన్ని నమోదు చేసింది.

ప్రయోగాల మొనగాడు

దేశ చలనచిత్రరంగంలో అప్పటివరకు కౌబాయ్ చిత్రాలు రానేలేదు. 'మోసగాళ్లకు మోసగాళ్లు'తో ఆ లోటును తీర్చేశారు కృష్ణ. అప్పట్లోనే ఈ చిత్రం పాన్ ఇండియా చిత్రంగా పలు భాషల్లో విడుదలైంది. క్రైమ్ అండ్ థ్రిల్లర్ జోన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా కృష్ణ సినిమాలు నిలిచేవి. అప్పటివరకు సాగుతున్న ఒరవడిని అధిగమించి తన సినిమాల్లో వైవిధ్యం చూపించేందుకు ఎంతటి సాహసమైనా చేసేవారు. అలా 'కొల్లేటి కాపురం' సినిమాతో తెలుగు తెరకు ఆర్.ఓ సాంకేతికతనకు పరిచయం చేశారు.



'గూడుపుఠాణి' చిత్రాన్ని మొదటి ఆర్ డబ్ల్యు కలర్‌తో తీశారు. తొలి తెలుగు ఫ్యూజీ కలర్ చిత్రం 'భలే దొంగలు'. తొలి 70 ఎంఎం సినిమా 'సింహాసనం'. స్టీరియోఫోనిక్ 6 ట్రాక్ సాంకేతికతతో సౌండ్ టెక్నాలజీ వాడిన తొలి సినిమా ఇది. తొలి ఫుల్‌స్కోప్ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'.

కృష్ణ నటించిన మల్టీస్టారర్ రికార్డును ఇంతవరకు ఎవరూ అందుకోలేకపోయారు. తన తరం నటులతో మొదలైన ఆయన మల్టీస్టారర్ ప్రస్థానం తన తరువాతి తరం నటులతో కూడా కొనసాగింది. 'మల్టీస్టారర్ మూవీ అంటే ఇలా ఉండాలి' అన్న మార్క్‌ను క్రియేట్ చేశారు. కెరీర్ మొత్తంలో 50 మల్టీస్టారర్స్ చేశారు.

> **తెలుగు వెండి తెరకు వెలుగు తెచ్చినవాడు .. ఎన్నెన్నో ప్రయోగాలకు తానే వాహిక అయినవాడు ... తను ఎంచుకున్న కథల చేత, సినిమాల వెలువరించిన వేగం చేత, ఎందరినో ఆదుకున్న మంచి మనసు చేత ... ఆయనొక సూపర్ స్టార్. హీరో కృష్ణగా దాదాపు నాలుగు దశాబ్దాలు వెండితెరను ఏలిన ఘట్టమనేని శివ రామ కృష్ణమూర్తి. ఎన్నో తొలి మేలిమి అడుగుల చేత ఆయన తెలుగు సినీ పరిశ్రమకు స్ఫూర్తిదాయక మూర్తి.**

దర్శక, నిర్మాతగా..

కృష్ణ తొలిసారి దర్శకత్వం వహించిన సినిమా 'సింహాసనం'. బాలీవుడ్ నుంచి సంగీత దర్శకుడు బప్పిలహరిని ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం చేశారు. ఆ తరువాత 'నాగాస్త్రం', 'ముగ్గురు కొడుకులు', 'కొడుకు దిద్దిన కాపురం' వంటి అనేక విజయవంత చిత్రాలు ఆయన దర్శకత్వంలో వచ్చాయి. అప్పటివరకు ఉన్న నటులకు భిన్నంగా తండ్రీ కొడుకులు కలసి నటించడంలో కూడా కొత్త ట్రెండ్ సెట్ చేశారు.

పద్మాలయ స్టూడియోస్ ప్రొడక్షన్ కంపెనీ ద్వారా అనేక సినిమాలను నిర్మించారు. గ్రామీణ నేపథ్యం ఉన్న పాత్రల్లో ఒదిగిపోయేవారు. పంచెకట్టులో కృష్ణ చేసిన రైతు పాత్రలు ట్రెండ్‌సెట్‌గా నిలిచాయి. కుటుంబ బంధాలు, ఆత్మీయత, రక్తసంబంధాలు మేళవించిన సినిమాల్లో ఆయన నటించారు అనడం కంటే జీవించారనొచ్చు.

తెలుగులో భారీ బడ్జెట్ సినిమాలకు నాంది పలికింది కృష్ణే. లక్షల రూపాయలతో సినిమా పూర్తిచేసే ట్రెండ్‌ను దాటి 'సింహాసనం' సినిమాకు కోటికి పైగా పెట్టుబడి పెట్టారు. దర్శక నిర్మాతగా రాణిస్తూనే 500 పైచిలుకు చిత్రాల్లో నటించారు. 325కి పైగా హీరోగా చేశారు. దర్శకుడిగా 16 సినిమాలు తెరకెక్కించారు. 50 చిత్రాలను నిర్మించడం, 25 సినిమాల్లో ద్విపాత్రాభినయం, 7 సినిమాల్లో త్రిపాత్రాభినయం చేసిన రికార్డు ఆయనది. వందకు పైగా దర్శకులతో పనిచేశారు. 80 మందికి పైగా హీరోయిన్లతో నటించారు.

డేరింగ్ అండ్ డాషింగ్

ఒప్పుకున్న పాత్ర కోసం ఎంత రిస్క్ తీసుకోడానికైనా సిద్ధమయ్యేవారు. మొదటి సినిమా 'తేనె మనసులు'లో స్కూటర్‌తో కారును చేజ్ చేసే సీన్ చేశారు. ఆయన స్కూటర్‌ని వదిలేసి కారు మీదికి జంప్ చేయడం చూసి ప్రేక్షకులు థ్రిల్ అయిపోయారు. ఇంత రిస్కీ షాట్‌ను డూప్ లేకుండా చేశారని తెలియడం వల్లే దర్శకులు డూండీ 'గూఢచారి 116'కి హీరోగా కృష్ణను తీసుకున్నారని చెబుతారు. ఆ తర్వాత కూడా చాలా సినిమాల్లో అడ్వెంచర్స్ చేశారు కృష్ణ. ఎంత రిస్క్ అయినా పాత్రకి ప్రాణం పోయాలని తపనపడేవారు. అందుకే అప్పట్లో అందరూ ఆయన్ని డేరింగ్ అండ్ డ్యాషింగ్ హీరో అనేవారు.

సేవాగుణంలో మిన్న

1977 నవంబర్ 19న దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు 10 వేల రూపాయలు విరాళం ప్రకటించడమే కాకుండా, లక్ష రూపాయలు విలువచేసే నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు కృష్ణ. ఒక ఏడాది పాటు తనకు వచ్చే ఆదాయంలో 10 శాతం సొమ్మును తుపాను బాధితులకు అందచేశారు.

సేవాతత్పరతే కాదు, కృతజ్ఞత కలిగిన వ్యక్తిత్వం ఆయనది. తనకు తొలి సినిమా అవకాశం ఇచ్చిన ఆదుర్తి సుబ్బారావు మరణించినప్పుడు అవుట్‌డోర్ షూటింగులో వున్న కృష్ణ ఆదుర్తి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ప్రముఖ వార్తాపత్రిక 'ద హిందూ' వినియోగించే ప్రత్యేక విమానంలో వెళ్లారు. ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు ఆదుర్తి సొంత బ్యానర్‌పై సినిమాలు తీసేందుకు సిద్ధమై లాభం వస్తే ఆదుర్తి కుటుంబానికి, నష్టం వస్తే తన ఖాతాలో జమ చేసుకునేవారు. ఆర్థికంగా చితికిపోయిన తన తోటి కథానాయకులు, స్నేహితులకు కూడా ఎప్పుడూ బాసటగా ఉండేవారు.

ఓ చిన్న పల్లెటూరి నుంచి వచ్చి ఇంత పెద్ద సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసిన కృష్ణ తెలుగు సినీ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు. ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోనిది.. ఎన్నటికీ మాసిపోనిది.

సూపర్ స్టార్ ..!







సూపర్‌స్టార్ కష్ణ కన్నుమూతతో ఒక తరం తెలుగు వెండితెర తారాలోకం తరలిపోయినట్టయింది. 350 పైగా చిత్రాల్లో నటించిన కృష్ణ ఓ రైతుగా, కుటుంబ సభ్యునిగా, విప్లకారునిగా, కార్మికునిగా, ప్రేమకునిగా, వృత్తిదారుగా, సీతారామరాజుగా కనిపించి అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. విజయనిర్మలతో కలిసి నటించిన 'మీనా', 'పాడి పంటలు' చిత్రాల్లో రైతుగా, 'అల్లూరి సీతారామరాజు', ఈనాడు, చిత్రాల్లో ప్రజా సమస్యలపై ఉద్యమించే విప్లవకారునిగా కనిపించారు. మంచి కుటుంబం, విచిత్ర కుటుంబం, అక్కాచెల్లెళ్లు, పండంటి కాపురం, ఉండమ్మ బొట్టు పెడతా వంటి చిత్రాల్లో భాధ్యతగల వ్యక్తిగా, ప్రేమికుడిగా కనిపించారు. ఇలాంటి మరెన్నో సినిమాల్లో తనదైన శైలిలో నటించారు. అన్ని కోణాలూ ప్రదర్శించే సామర్థ్యం ఉన్న వ్యక్తిగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

అద్భుతమైన పాటలు

సినిమాల్లో ఘంటసాల మొదలుకొని పీబీ శ్రీనివాస్, బాల సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, మాధవపెద్ది రమేష్, జేసుదాసు, రాజ్ సీతారాం అందరూ పాడారు. ఆయన నటించిన చిత్రాల్లో ఎన్నో పాటలూ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయి. సీతారామరాజు చిత్రంలో 'తెలుగు వీర లేవరా..దీక్షబూని సాగరా..', 'వస్తాడు నా రాజు ఈ రోజు', సింహాసనం సినిమాలో 'ఆకాశంలో ఒక తార', ఇంద్రధనస్సు చిత్రంలో 'నేనొక ప్రేమ పిపాసిని', పండంటి కాపురంలో 'ఈనాడే కట్టుకున్న పొదరిల్లు' పాటలు ఇప్పటికీ ఎవర్‌గ్రీన్‌గా నిలుస్తాయి. గూడు పుఠాణి చిత్రంలో 'తనివి తీరలేదే.. నా మనసు నిండలేదే' పాట ప్రేమికుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది. ఈనాడు చిత్రంలో 'నేడే.. ఈ నాడే..' పాట ప్రజలను ఇప్పటికీ చైతన్య పరుస్తుంది. చుట్టాలున్నారు జాగ్రత్త...లో శ్రీదేవితో కలిసి 'రెక్కలు తొడిగి రెపరెపలాడి రివ్వంటుంది కోరిక' పాట ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. కృష్ణ తన కుమారులు రమేష్, మహేష్‌బాబుతో కలిసి నటించిన 'ముగ్గురు కొడుకులు' చిత్రంలో 'సంసారమే బృందావనం' పాట ప్రతి ఒక్కరినీ ఎమోషనల్‌గా దగ్గర చేసింది. చాలా కాలం తర్వాత ఆలీ హీరోగా నటించిన 'యమలీల' చిత్రంలో కృష్ణ 'జుంబారే.. జుజుంబరే' పాట కుర్రకారుకు ఊపునిచ్చింది. ఇటువంటి ప్రేక్షకుల హృదయాలను కదిలించే ఎన్నో పాటలు ఆయన చిత్రజీవితంలో నిండి ఉన్నాయి.



అనేకమంది కథానాయికలతో ...

అలనాటి టాప్ హీరోయిన్స్ అయిన శ్రీదేవి, జయసుధ, జయప్రదలతో జతకట్టి సినిమాలు తీశారు కృష్ణ. విజయనిర్మలతో 50 వరకూ చిత్రాల్లో నటించారు. జయప్రద, జయసుధలతో 40కి పైగా, శ్రీదేవి సరసన 30 సినిమాలకు పైగా నటించారు. ఆ తర్వాత తరం అయిన విజయశాంతి, రాధా, సౌందర్య వంటి తారల పక్కనా అనేక చిత్రాలు చేశారు.

సంక్రాంతికి సినిమాలు విడుదల చేసే విషయంలో కృష్ణ రికార్డు సృష్టించారు. నాలుగు దశాబ్దాల సినీ కెరీర్‌లో ఆయన నటించిన 30 చిత్రాలు సంక్రాంతి పండగకు విడుదల అయ్యాయి. 1976 నుంచి 1996 వరకూ 21 సంవత్సరాల పాటు ప్రతి ఏటా వరుసగా సంక్రాంతి సినిమాలు విడుదల చేశారు. అప్పట్లో అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీఆర్ సినిమాలతో పాటు కృష్ణ సినిమాలూ విడుదల అయ్యేవి.

మరికొన్ని విశేషాలు..

హీరోగా తొలి సినిమా విడుదలైన 50 ఏళ్ల తరువాత ఆయన కీలక పాత్రధారిగా 'శ్రీశ్రీ' పేరుతో 2016లో చివరి సినిమా విడుదలైంది. ఏ నటులకు లేనన్ని అభిమాన సంఘాలు రికార్డు స్థాయిలో 2500 ఉండేవి. 'సింహాసనం' సినిమా శతదినోత్సవ సభకు 30 వేల మంది అభిమానులు స్వచ్ఛందంగా 400 బస్సుల్లో వచ్చారు. చిత్రసీమకు ఆయన చేసిన సేవకు గుర్తింపుగా ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం (1997), ఎన్టీఆర్ జాతీయ పురస్కారం (2003), ఆంధ్రవిశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (2008), పద్మభూషణ్ పురస్కారం (2009) లభించాయి.



ఐఓఏ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లుగా ఎన్నికైన మేరీకోమ్, శరత్ కమల్‌కు రిటర్నింగ్ ఆఫీసర్ ఉమేశ్ సిన్హా మంగళవారం నియమాక పత్రాలను అందజేశారు. ఇక అథ్లెట్స్ కమిషన్‌కు ఎన్నికైన శివ కేశవన్, పివి సింధు, గగన్ నారంగ్, మీరాభాయి ఛాను, రాణి రాంపాల్, భవానీ దేవి, భజరంగ్ లాల్, ఒపి కర్హానాలకూ ఉమేశ్ సిన్హా నియామక పత్రాలను అందజేశారు.

ఐపిఎల్‌కు పొలార్డ్ గుడ్‌బై

విలియమ్సన్, పూరన్‌ను వదులుకున్న హైదరాబాద్

రిటైన్, రిలీజ్ ఆటగాళ్ల జాబితా విడుదల

ముంబయి: అన్ని ఫ్రాంచైజీలు తమవద్ద రిటైన్, రిలీజ్ చేసే ఆటగాళ్ల వివరాలను మంగళవారం ఐపిఎల్ గవర్నింగ్ బాడీ వెల్లడించింది. ముంబయి ఇండియన్స్ స్టార్ ఆటగాడు కీరన్ పొలార్డ్ ఐపిఎల్‌కు గుడ్‌బై చెప్పగా.. ఆ ఫ్రాంచైజీకి బ్యాటింగ్ సలహాదారుగా కొనసాగనున్నాడు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ విలియమ్సన్‌తోపాటు, నికోలస్ పూరన్‌లను వదులుకోగా.. ఫ్రాంచైజీలు తమ వద్ద మిగిలిన ఉన్న నగదుతో పాటు అదనంగా రూ. 5కోట్ల రూపాయలు ఖర్చు చేసుకొనేందుకు ఐపిఎల్ గవర్నింగ్ బాడీ అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. వేలంలో రైట్ టు మ్యాచ్ కార్డ్‌ను ఎత్తి వేయడంతో కొన్ని ఫ్రాంచైజీలు వదులుకున్న ఆటగాళ్లను మరో ఫ్రాంచైజీ అదే ధరకు కొనుగోలు చేసుకొన్నాయి. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో రవీంద్ర జడేజా తిరిగి చోటు సంపాదించుకోగా.. డ్వేన్ బ్రేవోకు వీడ్కోలు పలకడం విశేషం. డిసెంబర్‌లో కొచ్చి వేదికగా మినీ వేలం జరగనుంది.

ఫ్రాంచైజీల వద్ద మిగిలిన నగదు, రిలీజ్ ఆటగాళ్ల జాబితా...

ఢిల్లీ క్యాపిటల్స్(మిగిలిన నగదు: 19.45కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 2)
రిలీజ్ ఆటగాళ్లు: శార్దూల్ ఠాకూర్, టిమ్ షెఫర్డ్, అశ్విన్ హెబ్బర్, శ్రీకర్ భరత్, మన్‌దీప్ సింగ్

రాజస్తాన్ రాయల్స్: (మిగిలిన నగదు: 13.20కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 4)
రిలీజ్ ఆటగాళ్లు: అనునయ్ సింగ్, కర్బియన్ బోస్, డర్లీ మిఛెల్, జేమ్ నీషమ్, కరణ్ నాయర్, నాథన్ కౌల్టన్-నైల్, డుస్సెన్, శుభమ్ గర్వాల్, తేజాస్ బరోకా.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: (మిగిలిన నగదు: 8.75కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 2)
రిలీజ్ ఆటగాళ్లు: బెహ్రెన్‌డార్ఫ్, గౌతమ్, మలింద్, సిసోడియా, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్.

లక్నో సూపర్‌జెయింట్స్: (మిగిలిన నగదు: 23.35కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 4)
రిలీజ్ ఆటగాళ్లు: ఆండ్రూ టై, రాజ్‌పుత్, ఛమీర, లెవీస్, హోల్డర్, మనీష్, షాబాజ్ నదీమ్.

గుజరాత్ టైటాన్స్: (మిగిలిన నగదు: 19.25కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 3)
రిలీజ్ ఆటగాళ్లు: రహ్మానుల్లా జద్రాన్, లూకీ ఫెర్గుసన్, డోమినిక్ డ్రాక్స్, గుర్‌కీరత్ సింగ్, జేసన్ రాయ్, వరుణ్ అరోన్.

కోల్‌కతా నైట్‌రైడర్స్: (మిగిలిన నగదు: 7.05కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 3)
రిలీజ్ ఆటగాళ్లు: పాట్ కమ్మిన్స్, సామ్ బిల్లింగ్, అమన్ ఖాన్, శివమ్ మావీ, మహ్మద్ నబీ, ఛమిక కరుణరత్నే, ఆరోన్ ఫించ్, అలెక్స్ హేల్స్, అభిజిత్ థోమర్, రహానే, అశోక్ శర్మ, బాబా ఇంద్రజిత్, ప్రథమ్ సింగ్, రమేశ్ కుమార్, రసిక్ సలామ్, షెల్డన్ జాక్సన్.

పంజాబ్ కింగ్స్: (మిగిలిన నగదు: 32.02కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 3)
రిలీజ్ ఆటగాళ్లు: మయాంక్ అగర్వాల్, ఓడెన్ స్మిత్, వైభవ్ అరోరా, బెన్నీ హోవెల్, ఇషాన్ పోరెల్, అన్ష్ పటేల్, ప్రేరక్ మన్కడ్, సందీప్ శర్మ, వృథిక్ ఛటర్జీ.

చెన్నై సూపర్‌కింగ్స్: (మిగిలిన నగదు: 20.45కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 2)
రిలీజ్ ఆటగాళ్లు: డ్వేన్ బ్రేవో, రాబిన్ ఊతప్ప, ఆడమ్ మిల్నే, నిషాంత్, జోర్డాన్, భగత్ వర్మ, ఆసిఫ్, జగదీశన్.

సన్‌రైజర్స్ హైదరాబాద్: (మిగిలిన నగదు: 42.25కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 4)
రిలీజ్ ఆటగాళ్లు: విలియమ్సన్, పూరన్, జగదీశ్ సుచిత్, ప్రియమ్ గార్గ్, రవికుమార్ సమృధ్, షెఫర్డ్, సౌరభ్ దూబే, సేన్ అబట్, శశాంక్ సింగ్, శ్రేయస్ గోపాల్, సుశాంత్ మిశ్రా, విష్ణు వినోద్.


ముంబయి ఇండియన్స్: (మిగిలిన నగదు: 20.55కోట్లు, విదేశీ ఆటగాళ్ల భర్తీ: 3)
రిలీజ్ ఆటగాళ్లు: పొలార్డ్, అన్మోల్‌ప్రీత్ సింగ్, అయన్ జుయెల్, బసిల్ థంపీ, డానియేల్ సామ్స్, ఫాబియన్ అలెన్, ఉనాద్కట్, మయాంక్ మార్కండే, మురుగప్ప అశ్విన్, రాహుల్ బుడ్డి, రిలే మెరిడిత్, సంజయ్ యాదవ్, థ్యామల్ మిల్స్.

ఆంధ్ర ఘన విజయం

అరుణాచల్ ప్రదేశ్‌పై 261పరుగుల తేడాతో గెలుపు

విజయ్ హజారే ట్రోఫీ

బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. మంగళవారం జరిగిన ఎలైట్ గ్రూప్-ఇలో ఆంధ్రప్రదేశ్ జట్టు 261పరుగుల తేడాతో అరుణాచల్‌ప్రదేశ్ జట్టును ఓడించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రజట్టు నిర్ణీత 50ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 367పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఆంధ్రజట్టులో అభిషేక్ రెడ్డి(136) శ్రీకర్ భరత్(100నాటౌట్), అశ్విన్ హెబ్బర్(60) బ్యాటింగ్‌లో రాణించారు. భారీ ఛేదనతో బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్‌ప్రదేశ్ జట్టు 38ఓవర్లలో 106 పరుగులకే ఆలౌటైంది. బండారు అయ్యప్ప(3/15), షోయబ్ ఎండిఖాన్(2/19), హరిశంకర్ రెడ్డి(2/25) బౌలింగ్‌లో మెరిసారు. ఈ గెలుపులో ఆంధ్ర జట్టు 6పాయింట్లతో నాల్గోస్థానానికి ఎగబాకింది.



స్టార్ ఆటగాళ్లు దూరం

ఫిఫా ప్రపంచకప్

దోహా: నాలుగు రోజుల్లో ఖతార్ వేదికగా ఫిఫా ప్రపంచకప్-2022 టోర్నీ ప్రారంభం కానుండగా.. ప్రధాన జట్లకు స్టార్ ఆటగాళ్ల కొరత వేధిస్తోంది. ఫిట్‌నెస్, గాయాల బెడద కారాణంగా వీరంతా మెగా సంగ్రామానికి దూరమయ్యారు. వీరిలో కొద్దిమంది యువ ఆటగాళ్లు ఉండగా.. మరికొందరు సీనియర్ ఆటగాళ్లు ఉన్నారు. స్పెయిన్ సీనియర్ ఆటగాడు, 2సార్లు యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌ను అందించిన సెర్జియో రమోస్(36) ఖతార్‌కు వెళ్లడం లేదు. స్పెయిన్ జట్టుకు సెంటర్ బ్యాక్ ఆటగాడిగా మంచి గుర్తింపు అతనికి ఉంది. అలాగే జర్మనీజట్టుకు ప్రపంచకప్ టైటిల్‌ను అందించిన 33ఏళ్ల మాట్స్ హెమ్మెల్స్ కూడా దూరమయ్యాడు. వీరితోపాటు ఫెర్లాండ్ మెండీ(ఫ్రాన్స్), రోబెర్టో ఫిర్మినో(బ్రెజిల్), జడాన్ సంచో(ఇంగ్లండ్), రెనాటో సాంఛెస్(పోర్చుగల్), ఇవాన్ టోనీ(ఇంగ్లండ్), థియాగో అల్కంటారా(స్పెయిన్), మిచ్ లాంగెరాక్(ఆస్ట్రేలియా) ఆటగాళ్లు గాయాల కారణంగా వైదొలిగారు. అలాగే 19ఏళ్ల అమెరికా స్ట్రయికర్ రికార్డో పెపీ ఫామ్ లేమితో జాతీయ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68